కడప-అన్నమయ్య జిల్లాలను కలుపుతూ ఉన్న గువ్వలచెరువు ఘాట్‌లో ప్రమాదాలను తగ్గించడంతో పాటు.. మెరుగైన రవాణా సౌకర్యం కోసం.. కేంద్ర ప్రభుత్వం సొరంగ మార్గం (టన్నెల్) తవ్వడానికి పచ్చజెండా ఊపింది. 2.5 కిలోమీటర్ల సొరంగ నిర్మాణం కోసం రూ.వేయికోట్ల నిధులను విడుదల చేసింది. దీనిపై ఈప్రాంత వాహనదారులు, ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# గువ్వలచెరువు ఘాట్‌లో సొరంగం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- రూ.వెయ్యి కోట్లు విడుదల చేసిన కేంద్రం
- త్వరలోనే పనుల ప్రారంభం
- తీరనున్న వాహనదారుల కష్టాలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని కడప-రాయచోటి మార్గంలో రామాపురం మండల పరిధిలో గువ్వలచెరువు వద్ద ఈ ఘాట్ ఉంది. ఈ ఘాట్ సుమారు 6 కిలో మీటర్ల మేర ఉంటుంది. ఈ ఘాట్‌లో పదికి పైగా మలుపులు ఉండగా.. అందులో కొన్ని ప్రమాదకరంగా ఉంటాయి. దీంతో ఇక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా యి. సగటున ప్రతి రోజూ ఈ ఘాట్‌లో ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతోంది. దీంతో పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. గాయపడ్డ వాళ్ల సంఖ్య పెద్ద సంఖ్యలోనే ఉంది. అదే విధంగా ఈ ఘాట్‌లో ప్రయాణం కూడా వాహనదారులకు చాలా కష్టతరంగా ఉంది. దీంతో ఈ ఘాట్‌లో సొరంగం తవ్వాలనే డిమాండు ఒకటన్నర దశాబ్ద కాలంగా ఉంది. సొరంగ మార్గం నిర్మాణం చేయడం వల్ల ప్రమాదాలు తగ్గడంతో పాటు.. వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

కర్నూలు-చిత్తూరు జాతీయరహదారి కావడంతో ఇదే మార్గం గుండా తమిళ నాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణాతో పాటు పలు రాష్ట్రాలకు లారీలు, రవాణా వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. కడప, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, కర్నూలు, నంద్యాలతో పాటు మరికొన్ని జిల్లాలకు ఈ మార్గం నుంచే వాహనాలు వెళ్తాయి. దీంతో రోజూ ఈ మార్గంలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ పరిస్థితుల్లో ఇక్కడ సొరంగ మార్గం ఏర్పాటు చేయడం ద్వారా.. ప్రజలకు ఎంతో ఉపయో గకరంగా ఉంటుంది. ఈ సొరంగ మార్గాన్ని కడప రోడ్డులోని సుగాలి బిడికి నుంచి ఘాట్ చివరి మలుపు వరకు నిర్మించనున్నారు.


గువ్వలచెరువు ఘాట్‌లో సొరంగమార్గం నిర్మాణానికి 2022లో సర్వే జరిగింది. సర్వే ప్రకారం 6 కిలోమీటర్ల రోడ్డులో ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు నిర్మించనున్నారు. 2.5 కిలో మీటర్లు సొరంగం తవ్వనున్నారు. 2023లో టెండర్లను కూడా పిలిచారు. ఈ నేపథ్యంలో గురువారం ఈ సొరంగ మార్గం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్‌లో పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

# కళ తప్పుతున్న ఏరువాక

- సాగు తగ్గిన వేరుశనగ
- సాధారణ సాగు.. 42852 ఎకరాలు
- సాగైంది.. 4059 ఎకరాలు
- పదిశాతం కంటే తక్కువకు పడిపోయిన సాగు




గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో ఏరువాక కళ తప్పుతోంది. ఒకనాడు పల్లెల్లో ఏరువాక పెద్ద పండుగ.. అయితే ఇప్పుడు ఆ పరిస్థితే లేదు. ఖరీప్‌లో పూర్తిగా వర్షాధారంగానే జిల్లాలో వేరుశనగ సాగు చేస్తారు. ప్రధానంగా రాయచోటి, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాలలో వేరుశనగ పంట సాగవుతుంది. ఒకప్పుడు లక్షల ఎకరాలలో ఈ పంటను సాగు చేయడం సాంప్రదాయంగా వచ్చేది. అయితే ఏటా ఖరీఫ్‌లో వేరుశనగ సాగు కనుమరుగవుతూ వస్తోంది. లక్షల ఎకరాలలో నుంచి వేల ఎకరాలకు సాగు పడిపోయింది. పూర్తిగా వర్షం మీద ఆధారపడే సాగు చేయాల్సి రావడం.. సకాలంలో వర్షాలు లేకపోవడం.. వరుస కరువు.. పెట్టుబడి ఏడాదికి ఏడాది పెరగడం.. దిగుబడి ఆశించినంత రాకపోవడం.. గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటి అనేక కారణాలతో ఖరీఫ్‌లో వేరుశనగ సాగు క్రమంగా తగ్గిపోతోంది.





ములకలచెరువులో బీళ్లుగా పొలాలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వేరుశనగ పంటను గతంలో అన్ని పల్లెల్లోనూ.. ఒకమాటలో చెప్పాలంటే.. పొలం ఉన్న ప్రతి రైతూ సాగు చేసేవాళ్లు.. అయితే ఇప్పుడా పరిస్థితి లేదు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం.. సాధారణ సాగులో కనీసం పది శాతం కూడా సాగు కావడం లేదు. ఈ ఏడాది జూలై మొదటి వారానికి కేవలం 9.5 శాతం మాత్రమే సాగైంది. దీన్ని బట్టే జిల్లాలో వేరుశనగ సాగు ఎంత దుస్థితిలో ఉందో.. అర్థం చేసుకోవచ్చు. 100 కుటుంబాలు ఉన్న పల్లెలో కనీసం నాలుగైదు కుటుంబాలు కూడా వేరుశనగను సాగు చేయడం లేదు. దీంతో ఎటు చూసినా బీడు భూములే కనిపిస్తున్నాయి. వేరుశనగకు బదులుగా పాడి, కూరగాయలు, పూల సాగు, ఇతర పంటల సాగు వైపు రైతులు దృష్టిసారిస్తున్నారు. ఫలితంగా.. పల్లెల్లో ఏరువాక వచ్చిన జాడలే కనిపించడం లేదు.

గాలివీడు మండలం నూలివీడు పంచాయతీ నక్కలవాండ్లపల్లె... ఈపల్లెలో సుమారు 100 కుటుంబాలు ఉన్నాయి. గతంలో ఇక్కడ ప్రతి రైతు వేరుశనగ సాగు చేసేవాళ్లు. ఒక్కో ఇంట్లో 50 నుంచి 300 బస్తాల వరకు దిగుబడి తీసేవాళ్లు. గిట్టుబాటు ధర లేకపోవడం, కూలీ రేట్లు పెరిగిపోవడం.. ఎరువులు, విత్తనాల ధరలు ఎక్కువగా ఉండడంతో వేరుశనగ సాగు తగ్గించారు. ప్రస్తుతం 100 కుటుంబాల్లో 20 కుటుంబాల వారు మాత్రమే వేరుశనగను సాగు చేస్తున్నారు. ఎకరా వేరుశనగ సాగు చేయడానికి దుక్కులు, విత్తనాలు, ఎరువులు, కూలీలు కలిపి రూ. 25వేలకు వరకు వస్తాయి. అయితే దిగుబడి మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. కనీసం పెట్టుబడులు కూడా చేతికి రావడం లేదు. దీంతో పల్లెలో ఎక్కువగా పాడి మీద ఆధారపడుతున్నారు.

సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం అడమికమ్మపల్లెలో 150 కుటుంబాలు ఉన్నాయి. అందరికీ వ్యవసాయమే జీవనాధారం. ఖరీఫ్‌లో వేరుశనగను సాగు చేసేవాళ్లు. ప్రస్తుతం ఓ 20 కుటుంబాలు సాగు చేస్తున్నాయి. మిగిలిన వాళ్లు పంటలు సాగు చేయడం లేదు. పల్లెలో ఎక్కడ చూసినా ఒకనాడు పచ్చదనంతో కళకళలాడిన పొలాలు బీళ్లుగా మారి వెక్కిరిస్తున్నాయి.

ములకలచెరువు మండలం దేవళచెరువు పంచాయతీ రాజుగారిపల్లెలో 100 కుటుంబాలు ఉన్నాయి. పదేళ్ల క్రితం ఈ గ్రామంలో ప్రతి ఒక్కరూ వేరుశనగను సాగుచేసేవాళ్లు. సుమారు 700 ఎకరాలకు పైగా వేరుశనగ ఖరీఫ్‌లో సాగయ్యేది. వరుసగా నష్టాలు వస్తుండడతో.. పంట సాగు చేయడం పూర్తిగా తగ్గించేశారు. ప్రస్తుతం కేవలం 100 ఎకరాల్లో మాత్రమే సాగుకు సన్నద్ధం అవుతున్నారు. అతివృష్టి లేదా అనావృష్టితో ప్రతిఏటా వేరుశనగ రైతులు నష్టపోతూనే ఉన్నారు.

## సాగైంది 4059 ఎకరాలు..

సాధారణంగా ఖరీఫ్‌లో జిల్లాలో వేరుశనగ 42852 ఎకరాలలో సాగు కావాలి. అయితే ఇప్పటికి కేవలం 4059 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఈశాన్య రుతుపవనాలు వచ్చినప్పటికీ.. ఆశించినంతగా వానలు పడలేదు. ఎక్కడా చెరువులు, కుంటల్లోకి నీళ్లు రాలేదు. ఒకటో.. రెండో పదున్ల వాన పడినప్పటికీ.. వేరుశనగ విత్తనాలు వేయడానికి రైతులు సాహసం చేయలేకున్నారు. తీరా విత్తనాలు భూమిలో వేసిన తర్వాత.. వానలు పడక పోతే... కనీసం పెట్టుబడులు కూడా చేతికి రావు. పశు గ్రాసం కూడా ఉండదని ఆందోళన చెందుతున్నారు. దీంతో విత్తనాలు సిద్ధంగా ఉంచుకున్నప్పటికీ.. విత్తడానికి ఆలోచిస్తున్నారు. దీంతో జిల్లాలో ఈ ఖరీఫ్‌లో వేరుశనగ సాగు కనీసం పది శాతానికి కూడా చేరలేదు.

### సాగు చేయడం వదిలేశా..



గతంలో 10 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేసేవాడిని. వరుస నష్టాలతో అంత సాగు చేయాలంటే భయమేస్తోంది. పెరిగిన విత్తనాల ధరలు, కూలీలు, ఎరువులు తదితర ఖర్చులతో పంట సాగు భారమవుతోంది. ఎలాగో కష్టపడి.. పంట సాగుచేస్తే.. తీరా చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు లేకుంటే.. వర్షాభావ పరిస్థితులతో నష్టాలు వస్తున్నాయి. దీంతో వేరుశనగ సాగు చేయడం లేదు.

**- శంకరప్ప, రాజుగారిపల్లె, ములకలచెరువు**

### పెట్టుబడులు రావడంలేదు..



గతంలో నేను నాలుగు ఎకరాల్లో సాగు చేసేవాడిని. ఈ ఏడాది పంట సాగు చేయడం లేదు. ప్రస్తుతం వ్యవసాయం చేసే వాళ్లులేరు.. పెట్టుబడులు పెరిగిపోయాయి. దిగుబడులు రావడం లేదు. నష్టాలు తప్ప.. లాభం లేదు. కూలీల డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో పొలాలు సాగు కావడం లేదు. వేరుశనగ సాగు ఒకప్పుడు ఏరువాక వస్తే..క్షణం కూడా తీరిక ఉండేది కాదు.. రెండు నెలల పాటు పొలం పనులలో బిజీబిజీగా ఉండే వాళ్లు.. ఏ పల్లెలో చూసినా వందల ఎకరాల వేరుశనగను సాగు చేసేవాళ్లు. ప్రస్తుతం పల్లెలో పట్టుమని పది మంది కూడా వేరుశనగ సాగు చేయడం లేదు. పొలాలన్నీ బీళ్ళుగా ఉన్నాయి. రైతులు పాడిపశువులు, చిరువ్యాపారాలతో కుటుంబ జీవనం సాగిస్తున్నారు.

**- ఎద్దుల పూడి వెంకటరమణ, అడవికమ్మపల్లె, సంబేపల్లె**

## ఖైదీ పరారీపై డీఐజీ విచారణ

రాజంపేట టౌన్, జూలై 5: రాజంపేట సబ్‌జైల్‌లో ఖైదీ పరారీపై శుక్రవారం నెల్లూరు రేంజి జైల్‌శాఖ డీఐజీ రాజేశ్వర్‌రావు విచారణ నిర్వహించారు. గత ఏడాది నవంబరు నుంచి ఓ హత్య కేసులో నిందితుడిగా రాజంపేట సబ్‌జైల్లో ఉన్న రైల్వేకోడూరుకు చెందిన బాషా గురువారం ఖైదీలను జైలు గది నుంచి బయటకు వంట చేయడానికి వదిలిన సమయంలో దుప్పటిని తాడుగా చేసుకుని గోడ దూకి పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న జైలర్ మల్ రెడ్డి రాజంపేట పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఖైదీ పరారీ సమాచారం తెలిసిన డీఐజీ శుక్రవారం జైలును సందర్శించి పూర్తిస్థాయి విచారణ చేశారు. విధుల్లో ఉన్న వార్డెన్‌ను సస్పెండ్ చేసినట్లు అనధికారిక సమాచారం.

## 2,516 మంది సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

నూజివీడు టౌన్, జూలై 5: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఆర్కే వ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం ప్రత్యేక కేటగిరిల్లో 2,516 మంది విద్యార్థులకు నూజివీడు ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి అయినట్లు ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. ఎన్‌సీసీ కేటగిరిలో మొదటి ఐదురోజులకు 1141 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 162 మంది, క్యాప్ విభాగంలో 167, దివ్యాంగుల విభాగంలో 249, క్రీడా విభాగంలో 796 మంది విద్యార్థులు తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారన్నారు. జనరల్ కౌన్సెలింగ్‌కు సంబంధించి క్యాంపస్‌ల వారీ ఎంపికైన విద్యార్థుల తుది జాబితా ఈ నెల 11న విడుదల చేస్తామని, ఎంపికైన విద్యార్థులు ధ్రువ పత్రాల పరిశీలన, నూజివీడు, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లలో జూలై 22, 23 తేదీల్లోనూ, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి ఆర్కే వ్యాలీలో 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌లో 26, 27 తేదీల్లో జరుగుతుందన్నారు.

## పోలీసుగేమ్స్‌లో ఆర్‌ఎస్‌ఐ కల్పన ప్రతిభ

### పతకాలు అందించిన డీజీపీ



డీజీపీ నుంచి పతకాలు అందుకున్న కల్పన

పోరుమామిళ్ల, జూలై 5: పోలీసు గేమ్స్‌లో పోరుమామిళ్ల వాసి, ఆర్‌ఎస్‌ఐ కల్పన డీజీపీ ద్వారకా తిరుమలరావు నుంచి పతకాలు అందుకుంది. ఇటీవల అస్సాం రాష్ట్రం గౌహతీ నగరంలో జరిగిన 9వ ఆలిండియా పోలీసు జూడో క్లస్టర్స్‌లో ఏపీ పోలీసు డిపార్ట్‌మెంట్ తరపున కర్నూలు జిల్లాలో ఆర్‌ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న కల్పన తైక్వాండో, కరాటే, సెన్‌కార్ట్, శిలాగ్ గేమ్స్‌లో రెండు పతకాలు సాధించింది. పోరుమామిళ్ల వాసి ప్రస్తుతం ప్రొద్దుటూరు ట్రాఫిక్ స్టేషన్‌లో పనిచేస్తున్న బాషా టీం కోచ్‌గా వ్యవహరించడం, రెండు పతకాలు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. కల్పన ద్వారక తిరుమలరావు నుంచి పతకాలు అందుకున్నందుకు పోరుమామిళ్ల ప్రాంతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన బాధ్యత

### డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు



అరుంధతీనగర్‌లో ఆరోగ్యంపై సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

చెన్నూరు, జూలై 5: వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత, స్వచ్ఛమైన నీరు, కలుషితం లేని ఆహారం ఇలాంటివన్నీ వ్యక్తిగతమేనని ఎవరి ఆరోగ్యం వారిదేనని ఏ ఒక్కరూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా జీవించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు అన్నారు. చెన్నూరు అరుంధతీవాడలో ఆశ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో శుక్రవారం పర్యటించారు. మురుగు కాల్వలు ఎక్కువగా ఉండడం, అందులో నీరు నిలిచి దోమలు పెరిగి వాటి విజృంభణ ఎక్కువ కావడం చూశారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో మలేరియా వచ్చే అవకాశం ఉందన్నారు. డెంగ్యూ తీవ్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడపడితే అక్కడ నీరు నిల్వకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లా ఉప మలేరియా అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన నీరు ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. నీరు కలుషితం కాకుండా కాచి వడగట్టి తాగాలన్నారు. చిన్నపాటి సమస్యలున్నా సమీప వైద్యశాలను సంప్రదించాలని, రెండు,మూడురోజులు విడవని జ్వరం ఉంటే రక్తపరీక్షలు తప్పనిసరన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, జిల్లా మలేరియా వైద్యాధికారి మునెమ్మ పాల్గొన్నారు.

## బయనపల్లె ఆంజనేయుడి ఆలయంలో చోరీ

### పసుపు దుస్తుల్లో వచ్చి పట్టపగలు చోరీ చేసిన వైనం

బద్వేలు రూరల్, జూలై 5: బయనపల్లె రామభక్త ఆంజనేయస్వామి ఆలయంలో పసుపు దుస్తులు ధరించి పట్టపగలే చోరీకి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఆలయ నిర్వాహకులు రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు గురువారం 11.30గంటలకు పూజారి ఇంటికి వెళ్లిన తర్వాత ఓ వాహనంలో ఏడుగురు వచ్చారని తాము మఠం నుంచి తిరుమల వెళుతున్నామని కాసేపు ఇక్కడ సేద దీరుతామని ఆలయం ముందు ఉన్న దుకాణ యజమానికి తెలిపి ఆలయంలోకి వెళ్లారన్నారు. ఓ ఇద్దరు దుకాణం వద్ద మాట్లాడుతుండగా లోపలికి వెళ్లిన ఐదుగురు ఆలయంలోని స్వామివారి వెండి కిరీటం, వెండి కళ్లు, వెండి పాదాలు, గద స్వామివారి అభయహస్తాలు, సీతమ్మవారి బంగారు తాళిబొట్టు సరుడు చోరీ చేసుకుని వెళ్లారని తెలిపారు ఆలయ పూజారి వచ్చి చూసే వరకు చోరీ జరిగినట్లు గుర్తించలేక పోయామన్నారు. కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

## రేషన్ వాహనాలపై ఇంకా మారని జగన్ స్టిక్కర్లు



గోపవరం, జూలై 5: గత నెల 4న ఎన్నికల ఫలితాల్లో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అదే నెల 12న ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పుడు చంద్రబాబు పాలన సాగుతోంది. అయినా మండలంలో ఇంకా వైసీపీ వాసనలే ఉన్నాయి. రేషన్ వాహనాలపై ఇప్పటికీ మాజీ సీఎం జగన్ ఫొటోలనే కొనసాగిస్తూ వాటితోనే రేషన్ పంపిణీ చేయడం చూసి జనం ఔరా.. ఇప్పుడు ఇంతకీ సీఎం చంద్రబాబా, లేక జగనా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యలు చేపట్టి దాదాపు 21 రోజులు కావస్తున్నా ఇంకా తొలగించకుండా రేషన్ వాహనాలపై జగన్ ఫొటో చూసి నాలుగురోజుల కిందట మాజీ ఎమ్మెల్యే విజయమ్మ టీడీపీ కార్యకర్తలపై మీరేం చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. అయినా లోకల్ నాయకులు పట్టించుకోకుండా ఉన్నారు.

రేషన్ బండ్లను తహసీల్దారు కార్యాలయానికి తీసుకురావాలసిందిగా తహసీల్దారు రోశన్న ఆదేశించారు. ఈ బండ్లను సబ్సిడీతో ఇవ్వడం ద్వారా అదే సొంత బండ్లు అన్నట్లుగా వైసీపీ నేతలు ఫీల్ అయిపోతున్నారు. అయితే సాక్షాత్తు తహసీల్దారే ఫొటోలు తీసేయాలని చెప్పినా మేమింతే అన్నట్లుగా వారు వ్యవహరించడం గమనార్హం.

## డ్రైనేజీ వివాదంపై ఇద్దరి మహిళలపై దాడి

రాజంపేట టౌన్, జూలై 5: నందలూరు పోలీసుస్టేషన్ సమీపంలోని టీడీపీకి చెందిన సుహాసిని, కాంతమ్మపై వైసీపీ నేతలు బాబు, సుజాత, సుబ్బరాయుడు మరికొందరు దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు మాట్లాడుతూ రెండు రోజుల కిందట డ్రైనేజీ విషయంపై ఘర్షణ జరిగిందన్నారు. ఈ విషయం వారు మనుసులో పెట్టుకుని వారి బంధువులను పిలిపించుకుని తమపై దాడి చేసినట్లు వారు తెలిపారు. టీడీపీ సానుభూతిపరులమనే కోపంతో దాడి చేశారని, పోలీసులు తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## వ్యక్తిపై దాడి - నగదు బంగారం చోరీ



గాయపడిన యానాదయ్య

నందలూరు, జూలై 5: టంగుటూరులో వ్యక్తిపై దాడి చేసి నగదు, బంగారు చోరీ చేసిన సంఘటన ఈనెల 1వ తేదీన చోటు చేసుకుంది. ఈ సంఘటనపై ఎస్‌ఐ మహ్మద్ జహీర్ మాట్లాడుతూ పగడాల సంతోష్ 1వ తేదీ మధ్యాహ్నం మునగ యానాదయ్య ఇంట్లోకి చొరబడి రూ.57 వేల నగదు, రెండు తులాల బంగారు చైను చోరీ చేసి వెళుతుండగా అడ్డుపడిన యానాదయ్యపై స్క్రూడ్రైవర్‌తో దాడి చేశాడు. గాయపడిన వ్యక్తి గురువారం తమకు ఫిర్యాదు చేయగా దాడిచేసిన యువకున్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# ఇందిరానగర్‌లో వైసీపీ భూ దందా

- రూ. కోట్లల్లో ప్రభుత్వ స్థలాల అమ్మకాలు
- పుట్టగొడుగుల్లా బోగస్‌పట్టాలు
- నేతలు, అధికారులు పరస్పర సహకారం
- టీడీపీ పాలనలో బయటికి వస్తున్న బాగోతం

కడప(రూరల్) జూలై 5: కడప కార్పొరేషన్‌లో విలీనమైన చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని ఇందిరానగర్‌లో వైసీపీ నేతల భూదందాకు అడ్డూఅదుపులేకుండా పోతోంది. వైసీపీకి చెందిన కీలకనేతలు రెవెన్యూ అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది పరస్పర సహకారంతో రూ. కోట్లల్లో దందా సాగించారు. ఇందిరానగర్ సహా పరిసర ప్రాంతాల్లోని మామిళ్లపల్లె రెవెన్యూ పొలంలో వందల కోట్ల విలువైన ప్రభుత్వ డీకేటీ, వివాదాస్పద భూములు మెండుగా ఉన్నాయి. సదరు స్థలాలను వైసీపీ నేతలు, అధికారులు పరస్పర సహకారంతో పథకం ప్రకారం బోగస్ పట్టాలను పుట్టించి అమ్మకాలు సాగించారు. ఒక్క ఇందిరానగర్‌లోనే వందకు పైగా ఇంటి స్థలాలను అమ్మినట్లు సమాచారం. ఇందిరానర్ ఎంట్రెన్స్‌లో ప్రభుత్వ అవసరాలకు ఉంచిన దాదాపు రూ. 3 కోట్లు విలువైన ఎకరా స్థలాన్ని కొందరు వైసీపీ నేతలు దక్కించుకుని వారి వాటా స్థలంలో ఒకటి ముక్కాల్ సెంటు ప్లాట్ రూ. 3 నుంచి 4 లక్షలకు ఆశావహులకు అమ్మి సొమ్ముచేసుకున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. సదరు స్థలాలు వివాదాస్పదం కావడంతో గుట్టు రచ్చకెక్కింది.

### ఫారెస్ట్ బఫర్ ల్యాండ్‌లో అక్రమకట్టడాలు

ఇందిరానగర్ యానాదుల కాలనీ, స్పోర్ట్స్ స్కూల్ మధ్య రింగ్‌రోడ్డుకు దాదాపు రెండెకరాల వరకు ఫారెస్టు బఫర్ ల్యాండ్ ఉంది. ఈ స్థలం రిమ్స్‌కు అతి సమీపంలో ఉండడంతో సెంటు స్థలం రూ. 2 లక్షల పైమాటగా ఉంది. ఇలా దాదాపు రూ. 4 కోట్ల విలువైన స్థలంలో వైసీపీ కీలకనేతలు, అధికారులు కలిసి అక్రమ కట్టడాలు వేయించారు. ఒక్కో అక్రమ కట్టడం నుంచి రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఒకవేళ వీరు డిమాండ్ చేసిన మొత్తంలో డబ్బు ఇవ్వకపోతే అక్రమ కట్టడం వేశావంటూ వీఆర్‌ఏను పంపించి సదరు నిర్మాణాలను కూల్చివేస్తుండేవారు. దీంతో ఆశావహులు చేసేదిలేక డిమాండ్‌చేసిన మొత్తాన్ని చెల్లించక తప్పడంలేదు. ఈ తతంగం తరువాత వైసీపీ నేతలే కార్పొరేషన్ సిబ్బందిని రంగంలోకి దించి అక్రమ కట్టడాలకు ఇంటిపన్ను, కుళాయి కనెక్షన్, కరెంట్ మీటర్లను ఏర్పాటు చేయించి మరో రూ. 50వేలను అదనంగా వసూలు చేసినట్లు సమాచారం. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో వీరి లీలలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి.



వైసీపీకి కట్టబెట్టిన రూ. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం

### పుట్టగొడుగుల్లా బోగస్‌పట్టాలు

ఇందిరానగర్‌లో బోగస్ ఇంటి పట్టాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కొందరు రెవెన్యూ అధికారులు వైసీపీ నేతలతో కలిసి బోగస్ ఇంటిపట్టాల దందాను సాగిస్తున్నట్లు వినికిడి. వైసీపీ నేత మొదట తన ఆధీనంలోని ప్రభుత్వ డీకేటి స్థలాన్ని రేటు కుదుర్చుకుని ఆశావహునికి అమ్ముతాడు. ఆ తరువాత ఆశావహున్ని పలానా రెవెన్యూ అధికారి వద్దకు పొమ్మంటాడు. అక్కడికి వెళ్లగానే సదరు అధికారి తన కింద పనిచేసే సిబ్బందికి పనిని అప్పగిస్తాడు. వెనువెంటనే వైసీపీ నేత అమ్మిన డీకేటీ స్థలానికి ఎవరికీ అర్థం కాని అధికారుల సంతకాలు, రెవెన్యూ సీల్‌తో కూడిన ఇంటి పట్టా తీసుకొచ్చి ఆశావహునికి ఇస్తాడు. ఇందుకు రూ. 30వేలను వసూలు చేస్తాడు. సమస్య వచ్చినప్పుడు సదరు ఇంటిపట్టాను పరిశీలిస్తే రెవెన్యూ రికార్డులతో సంబంధం ఉండదు. అనధికారికంగా బోగస్ పట్టాగా తేటతెల్లం అవుతుంది. ఇలాంటి బోగస్ పట్టాలు ఇందిరానర్‌లో కుప్పలు తెప్పలుగా ఆశావహుల చేతుల్లో ఉన్నాయి. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం రావడంతో ఆశావహులకు అడ్డదారుల్లో కట్టబెట్టిన ఇంటి స్థలాలకు ముప్పుఏర్పడింది. దీంతో వైసీపీ నేతలు, అధికారులు తేలుకుట్టిన దొంగల్లా ఉండిపోయారు.

### టీడీపీ నేతలకు గాలం

వైసీపీ పాలనలో కొందరు రెవెన్యూ అధికారులు వైసీపీ నేతలతో అంటకాగి ఇష్టానుసారంగా రెవెన్యూ రికార్డులతో సంబంధం లేకుండా ప్రభుత్వ స్థలాలను, భూములను ఇష్టం వచ్చినట్లు ధారాదత్తం చేశారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటి చిట్టాను బయటికి తీస్తున్నారు. దీంతో బాధ్యులైన అధికారులు తమ బాగోతం ఎక్కడ భయటపడుతుందోనని గాబరాపడుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. టీడీపీ నేతలకు లేనిపోని ఆశలు, భ్రమలు కల్పిస్తున్నారు. దీంతో కొందరు టీడీపీ నేతలు వారి మాయలో పడి వారిని కాపాడే పనిలో పడ్డారు. సదరు రెవెన్యూ అధికారులను ఆయా ఎమ్మెల్యేలు, నేతల వద్దకు తీసుకెళ్లి పరిచయం చేస్తున్నారు. దీంతో ఐదేళ్లపాటు వైసీపీతో అంటకాగి ఊడిగం చేసిన సదరు రెవెన్యూ అధికారులు టీడీపీ పాలనలో కూడా చక్రం తిప్పుతామనే భ్రమలో విహరిస్తున్నారు.

# వేంపల్లెలో యువకుడిపై దాడి





అజయ్‌కుమార్‌పై దాడిచేస్తున్న దృశ్యం - గాయపడిన అజయ్‌కుమార్‌రెడ్డికి చికిత్స చేస్తున్న దృశ్యం

- బాధితుడు సతీష్ రెడ్డి అనుచరుడు
- పరామర్శించిన వైసీపీ నేతలు
- కేసు నమోదు చేసిన పోలీసులు

వేంపల్లె, జూలై 5: స్థానిక పులివెందుల రోడ్డులో పట్టపగలే వైసీపీ కార్యకర్త వేంపల్లె అజయ్‌కుమార్‌రెడ్డిపై పలువురు గుర్తుతెలియని యువకులు మూకుమ్మడిగా దాడి చేశారు. శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి ముఖ్య అనుచరుడు అజయ్‌కుమార్‌రెడ్డి బైకులో వస్తుండగా బొలెరో వాహనంతో ఢీకొట్టి హాకీ స్టిక్కులు, క్రికెట్ బ్యాట్, రాళ్లతో తీవ్రంగా దాడి చేశారు. గాయపడిన అజయ్‌కుమార్‌రెడ్డిని వేంపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. టీడీపీ నేతలనే తిట్టేవాడివా అంటూ వారు దాడి చేశారు. ఈ ఘటనపై పది మందికి పైగా హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. సీఐ, బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పులివెందుల రోడ్డులోని ఓస్కూల్ నుంచి సాయంత్రం 4 గంటలకు అదే స్కూల్లో పనిచేస్తున్న శేఖర్‌తో కలిసి అజయ్‌కుమార్‌రెడ్డి బైకులో ఇంటికి బయలుదేరాడు. బైకు రోడ్డు మీదకు రాగానే అప్పటికే వేచి ఉన్న గుర్తుతెలియని వ్యక్తులు బొలెరో వాహనంతో ఢీకొట్టారు. పక్కనే కాచుకున్న యువకులు హాకీస్టిక్కులు, క్రికెట్ బ్యాట్, రాళ్లతో తీవ్రంగా దాడి చేశారు. వెంట ఉన్న శేఖర్ తప్పించుకుని స్కూల్ వద్దకు పరిగెత్తాడు. పాఠశాల నుంచి ఉపాధ్యాయులు కేకలు వేసుకుంటూ రావడంతో అజయ్‌కుమార్‌ను వదిలి బొలెరోలో పరారయ్యారు. సుమారు పది మంది దాకా దాడిలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ దాడి ఎందుకు జరిగిందనే విషయం పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అజయ్‌కుమార్‌ను సతీష్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, వేంపల్లె సర్పంచు ఆర్.శ్రీను తదితరులు పరామర్శించారు. అజయ్ మాట్లాడుతూ టీడీపీకి చెందిన రవితేజారెడ్డి, అజ్జుగట్టు రఘునాథరెడ్డిని మాట్లాడేవాడివా అంటూ విచక్షణా రహితంగా దాడి చేశారని విలేకరులకు తెలిపాడు. బాధితుడి సోదరుడు మౌనీధర్‌రెడ్డి వేంపల్లె పోలీస్‌సులకు చేసిన ఫిర్యాదుపై పది మందికి పైగా గుర్తుతెలియని వ్యక్తులపై హత్యాయత్నం కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## వసూరులో గొంటువారిపల్లె యువకుడు దారుణ హత్య



రక్తపు మడుగులో పడిఉన్న అస్సానయ్య

కాశినాయన, జూలై5: మండలంలోని గొంటు వారిపల్లె వాసి కల్లూరి అస్సానయ్య(26)ను తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా బత్తనపల్లి స్టేషన్ పరిధిలోని వసూర్‌లో గురువారం దారుణంగా హత్యకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడి కుటుంబీకుల, గ్రామస్తుల వివరాలమేరకు కల్లూరి పెద్దపీ రయ్య కుమారుడు అస్సానయ్య నాలుగు రోజుల కిందట వసూరులో కొత్తగా పీజీ ప్రారంభించాడు. తన పీజీలోని ఓగదిలో గొంతుకోసి పడేశారు. మృతిడి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో అనుమానించి బెంగుళూరులో ఉన్న కుటుంబ సభ్యులు శుక్రవారం పాజీ వద్దకు వెళ్లారు. అప్పటికే అస్సానయ్య రక్తపు మడుగులో చనిపోయి పడి ఉన్నాడు. విషయం స్థానిక పోలీసులకు తెలియపరిచి కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు తరలించా రు. మృతుడు దాదాపు రెండేళ్ల కిందట కొమరోలు వాసి వీరాంబిని ప్రేమవివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం వారికి 3 నెలల పాప ఉన్నట్లు సమాచారం. గ్రామంలో వలంటీరుగా పనిచేస్తున్న అస్సానయ్య ఎన్నికలకు ముందు గ్రామం వదిలి బెంగుళూరుకు పోయినట్లు సమాచారం. మృతికి గలకారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

## యూ ట్యూబర్‌పై కేసు నమోదు

రైల్వేకోడూరు(రూరల్), జూలై 5: ఏపీ న్యూస్ యూట్యూబర్ దార్ల ఆనంద్‌బాబుపై రైల్వేకోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. నరసారాంపేట వాసి జంగిటి సుభద్రను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ టి.బాబు తెలిపారు. గతంలో ఇదే యూట్యూబర్‌పై సుభద్రను దాడి, లైంగిక వేధింపులు చేసిన కేసు నమోదు అయినట్లు అయిన పేర్కొన్నారు.

## నేడు పులివెందులకు జగన్ రాక

పులివెందుల, జూలై 5: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పులివెందులకు రానున్నారు. తాడేపల్లె నుంచి 11గంటలకు బయలుదేరి 11.30కు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 11.40కు ప్రత్యేక విమానంలో బయలుదేరి 12.25గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 12.35గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 2గంటలకు పులివెందుల చేరుకుంటారని పీఏ నాగేశ్వరరెడ్డి తెలిపారు.

## రైలుకింద పడి వృద్ధుడు ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడప (క్రైం) జూలై 5: కడప రైల్వేస్టేషన్ మూడో నెంబరు ప్లాట్‌ఫారం సమీపంలో రైలుకింద పడి గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడి వయసు సుమారు 65 నుంచి 70 ఏళ్లుంటాయని తెలిపారు. కడప చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరుగుతుంటాడని, అతని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని కడప రిమ్స్ హాస్పిటల్ మార్చురీ గదిలో ఉంచినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన యెడల కడప రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

## ఎరువులు, మందుల దుకాణాల తనిఖీ



సీజ్ చేస్తున్న మందులు

మైదుకూరు, జూన్ 5: పట్టణంలోని పలు ఎరువులు, మందుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేసి, అమ్మకానికి నిలిపేసిన కొన్ని మందులను సీజ్ చేశారు. తిరుపతి, కడప విజిలెన్స్ అధికారులు ప్రసాద్, ఈదురుబాష స్థానిక మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్నతో కలిసి పట్టణంలోని పలు దుకాణాలను పరిశీలించారు. వివిధ దుకాణాల్లో అమ్మకాలను నిలుపుదల చేసిన మందులు దాదాపు వాటి విలువ రూ. 8700 గల వాటిని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

పెద్దమండ్యం, జూలై 5: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వివాహిత కీర్తన(20) మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు పెద్దమండ్యం పరిధిలోని బిక్కావాండ్లపల్లి వాసి రెడ్డప్ప కుమార్తె కీర్తనకు మదనపల్లి మండలం పెంచిపాడు పంచాయతీ గొల్లపల్లికు చెందిన లక్ష్మన్నతో 8 నెలల కిందట వివాహమైంది. వారం రోజుల కిందట భార్యభర్తలిద్దరూ బిక్కావాండ్లపల్లికు వచ్చారు. ఈ నెల 3వ తేదీన కీర్తనకు తీవ్రం గా కడపు నొప్పి రావడంతో ఇంట్లో ఉన్న బలం కోసం తెచ్చిన మాత్రలు ఎక్కువగా మింగింది. అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు చికిత్స నిమిత్తం అన్నమయ్య జిల్లా రాయచోటికి తరలించారు. అక్కడ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శుక్రవారం పెద్దమండ్యం పోలీసులకు మృతురాలి బంధువులు తెలిపారు. పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కడప ఆస్పత్రిలోనే ఉంచినట్లు, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి కేసులో నిందితుడికి జైలు శిక్ష

రైల్వేకోడూరు(రూరల్), జూలై 5: బాలుపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ముల్లా గౌస్‌పై దాడి కేసులో నిందితుడు కాటూరి శేఖర్‌కు 18 నెలలు జైలు శిక్ష, రూ. 15 వేలు జరిమానా విధించినట్లు రైల్వేకోడూరు సీఐ టి.బాబు తెలిపారు. 2017లో కేసు నమోదైనట్లు అన్ని కోణాల్లో దర్యాప్తు పూర్తి చేసి రాజంపేట కోర్టు శిక్ష విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులపై దాడులు నిర్వహిస్తే శిక్షలు తప్పవని హెచ్చరించారు.

## నాలుగు టిప్పర్లు పట్టివేత



పట్టుబడిన టిప్పర్లు

ఖాజీపేట, జూలై 5: అర్ధరాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. నాగసానిపల్లె సమీపంలో రాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సమాచారంపై తనిఖీ చేయగా నాలుగు టిప్పర్లు పట్టుబడ్డాయి. వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జిరాక్స్ కేంద్రంలో చోరీ పోలీసులకు ఫిర్యాదు

కడప (క్రైం), జూలై 5: స్థానిక మునిరావు వీధిలోని జిరాక్స్ కేంద్రంలో ఉన్న జిరాక్స్, ల్యామినేషన్ మిషన్లు, కంప్యూటర్, ప్రింటర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు జిరాక్స్ సెంటర్ ప్రవీణ్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి షాపు మూసి వేసి ఇంటికి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు షాపులోని సీసీ ఫుటేజీని ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## యువకుడికి తీవ్రగాయాలు

మదనపల్లె టౌన్, జూలై 5: సీటీఎం క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్న ఇతను శుక్రవారం ఉదయం నిర్మాణ పనుల కోసం ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అశోక్‌కు తీవ్రగాయాలు కాగా మదనపల్లె సర్వజన బోధనా స్పత్రికి తరలించారు. అశోక్ పరిస్థితి విషమంగా మారడంతో తిరుపతికి రెఫర్ చేశారు. అవుట్‌పోస్టు పోలీసులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

## నేడు రవాణా శాఖ మంత్రి రాయచోటికి రాక

రాయచోటిటౌన్, జూలై 5: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం రాయచోటికి రానున్నారు. శనివారం ఉదయం 6 గంటలకు విజయవాడలో బయలుదేరి రోడ్డు మార్గంలో నెల్లూరు జిల్లా కావలి మీదుగా మధ్యాహ్నం 1.30 గంటలకు పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. మార్గమధ్యంలో కావలి పట్టణంలో ఎమ్మెల్సీ వెంకటకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలవనున్నారు. మధ్యాహ్నం నుంచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు.

## 15న పెనగలూరు మండల సమావేశం

పెనగలూరు, జూలై 5 : ఈనెల 15నమండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండూరు సౌందర్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ప్రధానంగా తాగునీరు, సీజనల్ వ్యాధులు, ఉపాధిహామీ, ఖరీఫ్‌సాగు విద్య, వైద్యం తదితర విభాగాల గురించి ప్రధానంగా చర్చ కొనసాగుతుందని ఆయన తెలిపారు. అన్నిశాఖల అధికారులు, అనధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

**నేడు సంబేపల్లెలో..**

**సంబేపల్లె:** సంబేపల్లె మండల సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక సభాభవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నిర్మలాదేవి తెలిపారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షురాలు ఆవుల నాగశ్రీలక్ష్మి అధ్యక్షత వహిస్తారన్నారు. శనివారం జరిగే మండల సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. మండలంలోని సమస్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

## సీఆర్‌కి సన్మానం



రామచంద్రయ్యను సత్కరించిన సిద్దవటం నేతలు

రాజంపేట, జూలై 5: ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రయ్యను రాజంపేటకు చెందిన పలువురు నాయకులు శుక్రవారం భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అతిరాల దేవస్థానం మాజీ చైర్మన్ బండారు బాలయ్య, చిట్వేలికి చెందిన న్యాయవాది అబ్బిగారి బాలాజీ, ఊటుకూరు మాజీ సర్పంచ్ ఎంఎల్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

**సిద్దవటం :** మండల సీనియర్ టీడీపీ నేత పుత్తా రామచంద్రయ్య, మండల టీడీపీ నాయకులు పుత్తా బాలయ్య, పెద్దపల్లి మాజీ వార్డు సభ్యుడు పుత్తా ఎల్లయ్య, బూత్ కన్వీనర్ ఉప్పల రామకృష్ణ, సిద్దవటం టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి పుత్తా శివానంద సీ రామచంద్రయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభా కాంక్షలు తెలియజేశారు.



# డెంగ్యూ నివారణపై దృష్టి సారించాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్య

సంబేపల్లె, జూలై 5: జిల్లాలో డెంగ్యూ నివారణపై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్య, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ వైద్య సిబ్బందికి సూచించారు.. శుక్రవారం మండలంలోని నారాయణరెడ్డిపల్లె సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందించారు. అనంతరం ముదినేనివడ్డెపల్లెలో ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. డ్రమ్ముల్లో, తొట్లలో లార్వాలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు శుద్ధి చేసుకోవాలన్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు వస్తే వెంటనే ఉప కేంద్రంలో గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బందితో కానీ డాక్టర్లను సంప్రదించాలన్నారు. వర్షాకాలం కావడంతో దోమలు విపరీతంగా పెరిగాయని, వాటి నుంచి రక్షించు కోవడానికి దోమతెరలు వాడాలన్నారు. వేపాకు పొగ వేసి దోమలబారి నుంచి తమను తాము రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ప్రసాద్, జయరామయ్య, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, 104 డీఈవో బాలకృష్ణంరాజు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్య

# ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమం

రాయచోటిటౌన్, జూలై 5: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఉద్యమిద్దామని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ పిలుపునిచ్చారు. శుక్రవారం చెన్నముక్కపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్ఎస్‌యూ 10వ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్‌యూ జిల్లా కార్యదర్శి శివారెడ్డి ఆధ్వర్యం లో జెండా ఆవిష్కరించి విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ 2014 జూలై 5న ఆవిర్భవించిన ఆర్ఎస్‌యూ పదేళ్లు పూర్తి చేసుకుని 11వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాయచోటిలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణకు ఉద్యమాలే శరణ్యమన్నారు. ప్రభుత్వ విద్య పరి రక్షణతో పాటు నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థపై పలు పోరాటాలకు ఆర్ఎస్‌యూ నాయకత్వం వహించిందన్నారు. దేశంలోని కరువు ప్రాంతాల్లో ఉన్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు కులాలతో సంబంధం లేకుండా, అన్ని రకాల సౌకర్యాలతో ప్రాథమిక స్థాయి నుంచి విద్య అందించాలనే లక్ష్యంతో ఆర్ ఎస్‌యూ రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. కానీ ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కోట్లు దోచిపెడుతున్నాయని, ఇది దుర్మార్గమైన కుట్ర అన్నారు. భవిష్యత్తులో దేశవ్యాప్త విధానంగా సమస్యల పరిష్కారానికి ఆర్ఎస్‌యూ నాయకత్వం వహిస్తుందని, అందుకు అనుగుణంగా సంస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, ఆర్ఎస్‌యూ నాయకులు వెంకటేశ్వర్లు, శివమహేశ్, వెంకట్రమణ, నవీన్, బాబు తదితరులు పాల్గొన్నారు.



చెన్నముక్కపల్లె హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్ఎస్‌యూ నేతలు

# కేన్సర్ నిర్ధారణపై శిక్షణ శిబిరం.. డీపీఎంవో తనిఖీ

రాయచోటిటౌన్, జూలై5: పట్టణంలోని కొత్తపేట రామాపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లాలోని వైద్యాధికారులకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న సమాజ ఆరోగ్య అధికారులకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న కేన్సర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జాతీయ ఆరోగ్య మిషన్ అన్నమయ్య జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ రియాజ్‌బేగ్, డీఎన్ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఆరోగ్య కేంద్రాల్లో ఓపీకి వచ్చిన రోగుల్లో కేన్సర్ లక్షణాలు ఎలా గుర్తించాలి, స్ర్కీనింగ్ పరీక్షల కోసం ఎక్కడకు రెఫర్ చేయాలి, ఒకవేళ నిర్ధారణ అయితే, రోగులు సక్రమంగా మందులు వాడే విధంగా ఫాలోఅప్ చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన వైద్యులు, సీహెచ్‌వోలతో శిక్షణ కార్యక్రమంలో ఏం నేర్చుకున్నారు. విధి నిర్వహణలో ఈ శిక్షణ ఎంత వరకు సహాయపడుతుంది. శిక్షణలో ఇంకా ఏమైనా మార్పుల అవసరం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎన్ఎంవో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2 వరకు నిర్వహించే కుష్టు బాధితుల సర్వేను విజయవంతం చేయాలని కోరారు. స్టాప్ డయేరియా, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించి వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ నాజియా తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

# గువ్వలచెరువు టన్నెల్‌కు నిధుల మంజూరు హర్షణీయం

రామాపురం, జూలై 5: గువ్వలచెరువు టన్నెల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై గువ్వలచెరువు గ్రామ సర్పంచ్ భర్త మాదరాసు శివయ్య హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని గువ్వలచెరువులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గువ్వల చెరువు ఘాట్‌లో టన్నెల్ నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని నిధులు మంజూరు చేయడం తో ప్రధాన మంత్రి మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, రాయచోటి ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గువ్వలచెరువు ఘాట్ రోడ్డు 6 కిలోమీటర్లు రోడ్డు ఉన్న రోడ్డులో ఇరువైపులా అప్రోచ్ రోడ్డు, దాదాపు 2.50 కిలోమీటర్ల మేర టన్నెల్ నిర్మాణం పనులు ఉంటాయన్నారు. కడప రోడ్డులోని సుగాలి బిడికి నుంచి ఘాట్‌లోని ఆఖరి మలుపులో జాయిన్ అవుతుందన్నారు. ఈ టన్నెల్ ఏర్పాటుతో ప్రమాదాలు చాలా వరకు తగ్గిపోతా యన్నారు.



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన డాక్టర్ పాలగిరి శ్రీనివాస్‌కుమార్‌రాజు

**మంత్రిని కలిసిన శ్రీనివాస్‌కుమార్‌రాజు**

**రాయచోటిటౌన్:** రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖామాత్యులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని శుక్రవారం మంగళగిరిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాసకుమార్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె రహదారితో పాటు జిల్లాలోని పలు అంశాలపై ఆయనతో చర్చించినట్లు తెలిపారు. గువ్వలచెరువు టన్నెల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు. గాలివీడు మాజీ సర్పంచ్ బసవరాజు శ్రీనివాసరాజు, కసిరెడ్డి వెంకటశివారెడ్డి, బీజేపీ నాయకులు మహేశ్‌రాజు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శరత్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

పుల్లంపేట, జూలై 5 : మండల పరిధిలోని రెడ్డిపల్లె అరుంధతివాడకు చెందిన రెడ్డిపాక వెంకటేశ్ గురువారం రెడ్డిపల్లె చెరువు కట్ట మీద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విధితమే. ఈ సందర్భంగా తెలుగుదేశంపార్టీ బీసీ నాయకులు రొంపిచెర్ల మురళి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి మృతుని తండ్రి పెంచలయ్యకు 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

**మత్తు పదార్థాలతో నష్టాలపై అవగాహన కల్పించాలి**

ఒంటిమిట్ట, జూలై 5 : తల్లిదండ్రులు తమ పిల్లలకు సక్రమమైన నడవడికను అలవరచాలని సీఐ పురుషోత్తమరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కోదండరామాలయం వెనుక భాగంలో మండలంలోని ప్రజలతో విద్యార్థులు, యువతపై తల్లిదండ్రులు దృష్టి సారించాలనే అంశంపై అవగాహన కల్పించారు. తమ పిల్లలు సమాజంలో ఎలా మెలగుతున్నారనే అంశంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. పిల్లలు గంజాయివంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఉండేందుకు తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. దేశంలో యువత సక్రమమైన మార్గంలో నడవడం ద్వారా గ్రామంతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

రాయచోటిటౌన్, జూలై5: వృక్ష రక్షణ సమితి వ్యవస్థాపకుడు తులసిరెడ్డి కుమారుడు క్రాంతికుమార్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలోని పిల్లలకు మానవత, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ప్లేట్లు, గ్లాసులు, పండ్ల పంపిణీతోపాటు, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మానవత శాఖ అధ్యక్షుడు గూడూరు ఖాదర్ బాషా, సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు గంగాధర్‌నాయుడు, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, గౌరవాధ్యక్షుడు వెంకట్రమణ, తదితరులు పాల్గొన్నారు.

## కేన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

ఓబులవారిపల్లె, జూలై 5: కేన్సర్ వ్యాధితో బాధపడుతు న్న వ్యక్తికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి శుక్రవారం 25 వేల రూపాయలను అందజేశారు, పెద్దఓరం పాడు పంచాయతీ పాపిరెడ్డిపల్లెకు చెందిన పాణ్యం మణి తండ్రి పాణ్యం వెంకటయ్య కేన్సర్‌తో బాధపడుతు న్న విషయం తెలుసుకుని ఆసుపత్రి ఖర్చుల కోసం ఈ మొత్తం అందజేశారు. హైదరాబాదులోని బసవతార కం కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యాన్ని ఫోన్‌ద్వారా సంప్రదించి ఉచిత వైద్యం అందేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



# జగన్ 'శ్రీరంగ నీతులు' విడ్డూరం

రాజంపేట, జూలై 5 : తన పదవీ కాలంలో హింసా రాజకీయాలను ప్రోత్సహించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం కోల్పోయిన వెంటనే శ్రీరంగ నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో టీడీపీ నాయకులపై చేసిన దారుణాలు మరిచిపోయారా అని నిలదీశారు. జైలుకెళ్లి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించడంతో పాటు, ఆయనను చాలా మంచోడిగా చిత్రీకరించడం ఏమిటన్నారు. అయ్యన్నపాత్రుడు, అచ్చెన్నాయుడులాంటి పలువురు నేతలను చిత్ర హింసలపాలు చేసిన జగన్ నేడు శ్రీరంగ నీతులు చెప్పడం ఏమిటన్నారు. కిషోర్ అనేవ్యక్తి టీడీపీ నేతల వాహనంపై గడ్డపారతో దాడి చేస్తే అతనికి మున్సిపల్ చైర్మన్ పదవిని కట్టబెట్టిన జగన్‌ను ఏమని పిలవా లన్నారు. ఏపీఎండీసీ మైనింగ్‌లో ఏ గ్రేడ్ ఖనిజాన్ని సీ గ్రేడ్‌గా మార్చి లక్షల టన్నుల బెరైటీస్‌ను అప్పనంగా అమ్మి వందల కోట్లు సంపాదించిన గత ఏపీఎండీసీ ఎండీ పై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజంపేట పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షురాలు వాణి, సర్పంచ్ వెంకట నరసయ్య, ఎంపీటీసీ పెంచలయ్య ధనుంజయనాయుడు, సుబ్రమణ్యం, దత్తాత్రేయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాద మృతుడికి నివాళి

వీరబల్లి, జూలై5: మండల పరిధిలోని తాటిగుంటపల్లి పంచాయతీ పిచ్చిగుంటపల్లి కత్తి వెంకట్రమణ నిన్నటి రోజున విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం రాజంపేట అసెంబ్లీ పార్లమెంట్ జనసేన పార్టీ నాయకులు రామాశ్రీనివాస్ ఎన్డీఏ నేతలతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకులు భాస్కర్‌రాజు, సునీత, జనసైనికులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సహకార సంఘాలతోనే అభివృద్ధి: జేసీ

రాయచోటి (కలెక్టరేట్) జూలై 5: సహకార సంఘాలతో అభివృద్ధి సాధ్యమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. ఈ నెల 6 న 102 వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని...శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో అధికారులతో కలసి అంతర్జాతీయ సహకార దినోత్సవ ప్రచార గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఈ నెల 6న ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు వేగవంతంగా అమలు చేయడానికి స్థిరమైన భవిష్యత్తు నిర్మించడంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రాజంపేట టౌన్, జూలై 5 : రాజంపేట మున్సిపల్ కార్మికు ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవి కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ప్రతినెలా ఐదో తేదీ లోపల వేతనాలు ఇవ్వాలన్నారు. గతంలో 16 రోజుల నిరవధిక సమ్మెకు సంబంధించి కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. మెడికల్ బిల్లు అమలు చేయాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ స్టేజి చెప్పాలని కోరారు. బదిలీ వర్కర్స్‌కు మూడు నెలల నుంచి వేతనాలు రాలేదని, ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు జీతాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వెంటనే రావాల్సిన బకాయిలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి రమణ, ప్రసాద్, సాలమ్మ, సురేష్, ప్రమీల, పెంచలయ్య, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

వీరబల్లి, జూలై 5: సాగులో ఉన్న గిరిజనుల భూమిని కబ్జా చేసి మామిడి చెట్లు నాటిన రాజగోపాల్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం గిరిజన రైతులతో కలిసి భూమిని పరిశీలించిన అనంతరం బాధితులతో కలిసి వీరబల్లిలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరబల్లి మండలం తాటిగుంట పల్లె గ్రామ పంచాయతీ కొత్తపల్లి ఎరుకుల కాలనీలో నివాసముంటున్న సాలముని లక్ష్మీదేవి భర్త రమణయ్య 1732 సర్వే నెంబర్‌లోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని 30 ఏళ్లుగా సాగు చేసుకుంటుండగా, రాజగోపాల్‌రెడ్డి ఆ భూమిలో దౌర్జన్యంగా మామిడి మొక్కలు నాటి వారిపై దౌర్జన్యం చేశాడని, ఆ భూమిని గిరిజనులకు అప్పగించి గిరిజన బిడ్డలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బుక్కే విశ్వనాథ్ తదితరులు

## స్త్రీనిధి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలి

వీరబల్లి, జూలై 5: బకాయిలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని స్త్రీనిధి ఏజీఎం ఉదయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన గ్రామ సమాఖ్య సిబ్బంది సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ బకాయిలు ఎక్కువగా ఉండడం వల్ల కొత్త రుణాలకు అవకాశం లేకుండా పోతుందన్నారు. ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సభ్యులు తీసుకున్న రుణాలను జీవనోపాధుల కల్పనకు కృషి చేయాలన్నారు. జిల్లా జీవనోపాధుల యాంకర్ పర్సన్ ఖైజర్‌ఖాన్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ద్వారా జీవనోపాధుల సర్వే ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్‌వలి, సీసీలు నాగేంద్ర, కృష్ణయ్య, సుభద్రమ్మ, గ్రామ సమాఖ్యల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏజీఎం ఉదయ్‌కుమార్

## బ్యాంకుల ద్వారా వేతనాలు చెల్లించాలి

గాలివీడు, జూలై5: గ్రామ పంచాయతీ కార్మికులకు బ్యాంక్ అకౌంట్ ద్వారా జీతాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాలివీడు పంచాయతీలో పనిచేస్తున్న 11 మంది కార్మికులపై తీవ్ర పని భారం ఉందన్నారు. గాలివీడు జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. కొబ్బరినూనె, చెప్పులు, టోపీలు, మాస్కులు, గ్లౌజులు ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఓబులమ్మ, లక్ష్మీదేవిలతో పాటు పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు రామచంద్ర, నరసింహులు, నారాయణమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

## క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలి

నందలూరు, జూలై 5 : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు. అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో తుంటి యానాదయ్య, సరోజమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు తుంటి నందా యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నందలూరు ప్రీమియర్ లీగ్ 9వ సీజన్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎస్ఐ మహ్మద్ అబ్దుల్‌జహీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ పల్లె గ్రీష్మంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ విజేతకు 40 వేల రూపాయలు, ద్వితీయ బహుమతి కింద 25 వేలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్‌లు, ముమ్మడిశెట్టి సుధా కర్, శివ, కోటి, మున్నా, రంజిత్, పుత్తా శంకర్, లయన్ కుర్రా మణియాదవ్, మేస్త్రసి నరేంద్ర, టైలర్ బాబు, నాగరాజు, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ అబ్దుల్ జహీర్, నందా యాదవ్

## వీరభద్రాలయంలో అమావాస్య పల్లకి ఉత్సవం

రాయచోటిటౌన్, జూలై 5: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకిపై ఆసీనులను చేశారు. అనంతరం మాడ వీధుల్లో పల్లకిని ఊరేగించారు.



పల్లకి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

## టీడీపీ అధ్యక్షుడితో టీఎన్ఎస్ఎఫ్ నేత భేటీ

రాజంపేట టౌన్, జూలై 5 : టీడీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం నూతనంగా రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాసులును శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ రేపూరి వేణుగోపాల్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ బలోపేతంలో యువకుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. టీఎన్ఎస్ఎఫ్‌ను రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయాలని టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థులకు, రాష్ట్ర పభుత్వానికి వారధిలా ఉండాలని సూచించారన్నారు. గత ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులను త్వరలోనే తొలగిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు వేణుగోపాలు తెలిపారు.

## టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కోర్టుకు హాజరు..

రాజంపేట టౌన్, జూలై 5 : విద్యారంగ సమస్యలపై నిర్వహించిన ఉద్యమాల సందర్భంగా నమోదైన కేసుల్లో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ కార్యదర్శి సురేష్‌బాబు, తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చీనేపల్లి హరీష్‌కుమార్ శుక్రవారం రాజంపేట కోర్టుకు హాజరయ్యారు. రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ సహకారంతో వీరి కేసులపై వాదనలు జరిగాయి. తదుపరి విచారణ ఈనెల 30వ తేదీకి వాయిదా వేసినట్లు వారు తెలియజేశారు.

## పుంగనూరు మండలపరిషత్
# ఏవో, సీఏ సస్పెన్షన్

● ఈవోపీఆర్డీపై చర్యలకు సిపార్సు
● రూ.1.36 కోట్ల గోల్‌మాల్‌పై చర్యలు

పుంగనూరు, జూలై 7: పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగి రూ.1.36 కోట్లు గోల్‌మాల్ చేసిన ఘటనలో ఏవో రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డిని జడ్పీ సీఈవో గ్లోరియా గురువారం సస్పెండ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు శుక్రవారం కార్యాలయానికి అందాయి. ఈ నిధుల గోల్‌మాల్‌పై గత నెల 20వ తేదీ 'ఆంధ్రజ్యోతి'లో 'అమ్మో..కాంట్రాక్టు ఉద్యోగి' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. 2022, 2023 సంవత్సరాలలో ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా కాంట్రాక్టుపై పనిచేసిన సునీల్ మండల పరిషత్ సాధారణ నిధులు రూ.1,36,68,668 స్వాహా చేశాడు. ఈ రెండేళ్లు ఏవో రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీ నారాయణ ఏమాత్రం పట్టించుకోకపోవడంతో నిధుల స్వాహా జరిగినట్లు విచారణలో తేలింది. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు ఏవో రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డిని గురువారం జడ్పీ సీఈవో గ్లోరియా సస్పెండు చేశారు. ఈవోపీఆర్డీ, ఇన్‌చార్జి ఎంపీడీవో నారాయణపై శాఖాపరమైనచర్యలు తీసుకోవాలని సిపార్సు చేస్తూ డీపీవో లక్ష్మికి ఫైల్ పంపారు. వ్యక్తిగతపనిపై ఎంపీడీవో మునిరెడ్డి సెలవులో వెళ్లగా, అధికారుల సస్పెన్షన్‌తో ఎంపీడీవో కార్యాలయం బోసిపోయింది.

## నాసిరకం భోజనంపై విచారణకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చిత్తూరు రూరల్, జూలై 5: చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అందించే భోజనంలో నాణ్యత లేకపోవడంపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఇచ్చిందే మెనూ.. పెట్టిందే తిను!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ విచారణకు ఆదేశించారు. మెనూపై పూర్తి నివేదిక సమర్పించాలంటూ ప్రభుత్వాస్పత్రి అధికారులకు ఆదేశాలిచ్చారు. భోజన నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

# బాగుపడిన శ్మశానం.. దారి

● ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన యంత్రాంగం



పనులను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ రాఘవేంద్రరాజు, పంచాయతీ కార్యదర్శి అంజాద్‌బాషా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గంగాధరనెల్లూరు, జూలై 5: నీవానది ఏటి ఒడ్డున శ్మశానం దారి, మృతదేహాలను పూడ్చే స్థలం ఎట్టకేలకు బాగుపడ్డాయి. ఈ ప్రాంతంలో మృతదేహాలను తీసుకెళ్లేందుకు, పూడ్చేందుకు ఉన్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం అంతిమ సంస్కారం ఎలా అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఈవోపీఆర్డీ రాఘవేంద్రరాజు, పంచాయతీ కార్యదర్శి అంజాద్‌బాషా గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సహకారంతో అధికారులు ఎక్స్‌కవేటర్‌తో నీవానది బ్రిడ్జి మొదటి నుంచి శ్మశానానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చికెన్, భవన వ్యర్థాలను తొలగించారు. మృతదేహాలను పూడ్చే స్థలంలో ముళ్లకంపలను శుభ్రం చేశారు. 8 చికెన్ సెంటర్ల నిర్వాహకులకు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. అతిక్రమిస్తే షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు.

# రెస్కో 'అక్రమ' ఉద్యోగులకు పోల్ టెస్ట్!

ఇతర పరీక్షలు కూడా ● అనర్హులుగా అత్యధికులు ● అక్రమ పదోన్నతి ఎండీనే పరీక్షాధికారి

కుప్పం, జూలై 5: కుప్పం విద్యుత్తు గ్రామీణ సంస్థ (రెస్కో)లో అక్రమ నియామకాలు నియోజకవర్గంలో చర్చనీయాంశమయ్యాయి. వైసీపీ హయాంలోని పాలకులు, అధికారుల అవినీతి చర్యల మూలంగా పొందిన ఈ ఉద్యోగాలు ఉంటాయో ఊడతాయో తెలియక లక్షలు సమర్పించుకున్న ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. రెస్కోలో అసిస్టెంట్ హెల్పర్లుగా అక్రమంగా చేరిన 104 మందికి శాంతిపురం రెస్కో కార్యాలయం ఆవరణలో శుక్రవారం పోల్ టెస్ట్‌తోపాటు, ఇతర నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. అధికారులు స్పష్టంగా చెప్పడంలేదు కానీ, ఈ పరీక్షల్లో సుమారు 60 మందికి పైగా అనర్హులుగా తేలినట్లు తెలిసింది. కుప్పం రెస్కోలో దాదాపు ఆరేడు నెలల క్రితం 122 మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. వీరిలో 109 మందిని అసిస్టెంట్ హెల్పర్లుగా నియమించుకున్నారు. మిగిలిన వారికి వివిధ విభాగాల్లో ఉద్యోగాలు ఇచ్చారు. దీనికి నాటి పాలకులకు, అధికారులకు లక్షల్లో ముడుపులు ముట్టాయన్నది బహిరంగ రహస్యమైపోయింది. టీడీపీ అధికారంలోకి రాగానే రెస్కోలో అక్రమాలపై టార్గెట్ చేసింది. జేసీ పి.శ్రీనివాసులు పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుంటూనే అక్రమ నియామకాలు, అవినీతి చర్యలపై విచారణ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఆరు నెలల ముందు ఉద్యోగాలు పొందిన 122 మందిలో అసిస్టెంట్ హెల్పర్లుగా ఉన్న 109 మందిని పరీక్షలకు పిలవగా 104 మంది హాజరయ్యారు. పోల్ టెస్ట్ (స్తంభాలు ఎక్కడం)తోపాటు ఇతర నైపుణ్య పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఉదయంనుంచి సాయంత్రం దాకా పోల్ టెస్ట్‌తోనే సరిపోయింది. ఈ టెస్ట్‌కు హాజరైన వారిలో కొందరు పోల్ ఎక్కకుండానే ఇళ్లకు వెళ్లిపోగా, మరికొందరు పోల్ ఎక్కడంలో విఫలమై వెనుదిరిగారు. పోల్ టెస్ట్ అనంతరం రీడింగ్ తీయడం, మెటీరియల్ వేరుచేయడం, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ అటెండ్ కావడం వంటి ఇతర నైపుణ్య పరీక్షలను శాంతిపురం రెస్కో కార్యాలయంలోనే నిర్వహించారు. పొద్దుపోయే వరకూ ఈ పరీక్షలు సాగుతూనే ఉన్నాయి. ఎంతమంది అనర్హులుగా తేలారన్న ప్రశ్నకు అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని, వారి ఆదేశాల ప్రకారమే చర్యలు ఉంటాయని చెప్పుకొచ్చారు. కానీ 60 మందికి పైగానే అనర్హులుగా తేలినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా, ఈ టెస్టులకు ఆరు నెలల క్రితం నియామకమైనవారినే కాకుండా పదీ పదిహేనేళ్లనుంచీ రెస్కోలో కిందిస్థాయిలో చేరి, పదోన్నతిపై జూనియర్ అసిస్టెంట్లు, ఇతర పదోన్నతులు పొందిన మరికొంతమంది ఉద్యోగులనూ చేర్చడం విమర్శలకు తావిస్తోంది.

### అక్రమ పదోన్నతి అధికారి పర్యవేక్షణలోనే పరీక్షలు

నిజానికి పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ పి.శ్రీనివాసులు పర్యవేక్షణలో పరీక్షలు జరగాలి. కానీ పదోన్నతి విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రెస్కో ఎండీ ప్రభాకర్ పర్యవేక్షణలో మొత్తం ప్రక్రియ నడవడం కూడా విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం రెస్కో ఎండీ ప్రభాకర్ పదోన్నతి మీద ఆ స్థానం పొందారు. అంతకు ముందు ఎండీగా ఉన్న సుబ్రమణ్యం పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఆ స్థానంలో కొనసాగారు. ఈ ఏడాది ఫిబ్రవరి 29న ఆయన పదవీ విరమణ చేశారు. దీనికి ఒకరోజు ముందు అంటే 28వ తేదీ రాత్రికి రాత్రి ఏడీఈగా ఉన్న ప్రభాకర్‌కు డీఈగా పదోన్నతి ఇచ్చారు. ఆ తర్వాత ఎండీగా పదోన్నతి కల్పించారు. ఇలా ఒక్క రోజే డబుల్ ప్రమోషన్ ఇచ్చారు. సీనియారిటీ ప్రకారం ఎండీ పోస్టుకు అర్హుడైన డీఈ మదన్ మోహన్‌ను ఎటువంటి నిబంధనలు పాటించకుండా రిలీవ్ చేసి గాలిలో ఉంచారు. ఆయనేమో దీనిపై కోర్టుకు వెళ్లి స్టే పొంది తిరిగి అదే డీఈ పదవిలో కొనసాగారు. ఇలా దొడ్డిదారిన ఎండీగా పదోన్నతి పొందిన ప్రభాకర్ పర్యవేక్షణలో, ఉద్యోగులకు అర్హత పరీక్షలు జరగడం విడ్డూరం. అంతేకాదు.. నాడు అక్రమ నియామకాలు జరగడంలో ప్రస్తుత ఎండీ కూడా ఆరోపణలు ఎదుర్కుంటున్నారు.

### అస్మదీయులకు ఉద్యోగాలు

ముడుపుల చెల్లింపులే కాదు.. వైసీపీ పాలకులకు, నేతలకు, కో ఆపరేటివ్ అధికారులకు, రెస్కో అధికారులకు చెందిన వారికీ అక్రమ నియామకాలలో చోటు లభించింది. అప్పటి కో ఆపరేటివ్ డీసీవో బ్రహ్మానందరెడ్డి కుమారుడు, ప్రస్తుత డీఎల్‌సీవో ఆనందన్ సోదరుని కుమారుడు, ఎండీ ప్రభాకర్ సోదరి కుమారుడు కూడా రెస్కోలో దొడ్డిదారిన ఉద్యోగాలు పొందారు. టెక్నికల్, రికార్డు అసిస్టెంట్లుగా వారికి అవకాశం కల్పించారు.



శాంతిపురం రెస్కో కార్యాలయం ఆవరణలో స్తంభాలు ఎక్కుతున్న ఉద్యోగులు

### ఏం చేస్తారో?

ఇన్ని అసంబద్ధతలు, అక్రమాలు, అవినీతి చర్యల నడుమ కునారిల్లుతున్న రెస్కోను గాడిలో పెట్టడానికి జిల్లా అధికారులైతే తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు. కానీ ఇక్కడ జరిగిన అవినీతి, అందులో ఎవరి పాత్ర ఎంత ఉందో వారికి సరైన అవగాహన లేదన్న ప్రచారం జరుగుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎండీని అక్రమ నియామకాలు పొందిన వారి పరీక్షలను పర్యవేక్షించమనడం దీనికి తాజా నిదర్శనం. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఒక స్పష్టమైన వైఖరిని తీసుకుని ముందుగా రెస్కోలో గతంలో ఏమి జరిగింది. ఎవరి పాత్ర ఎంత అన్న విషయంలో ఒక అవగాహనకు రావాల్సిన అవసరం ఉంది. ఆపైనే తదుపరి చర్యలకు ఉపక్రమిస్తేనే న్యాయం జరుగుతుంది.

# 'అమూల్' సేవలు చాలు

ఇక వెనక్కి వచ్చేయండి ● 22 మంది సహకార శాఖ అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్ల రద్దు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 5: గత ప్రభుత్వంలో 'అమూల్' సేవకు పంపిన 22 మంది సహకారశాఖ అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించారు. వీరు మూడున్నరేళ్లుగా డిప్యుటేషన్‌పై అమూల్‌లో పనిచేస్తున్నారు. పాలసేకరణ కోసంసొసైటీల ఏర్పాటు,షేర్ క్యాపిటల్ వసూ ళ్లు, బ్యాంకు ఖాతాలు తెరవడం, డాక్యుమెంట్ అప్‌లోడ్ వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు రూట్ ఆఫీసర్లుగా గ్రామగ్రామాన తిరుగుతూ అమూల్‌కే పాలు పోయాలంటూ సమావేశాలు పెట్టి నిర్బంధంగా విధులు నిర్వహించారు. దీంతో సహకారశాఖలో పనులు అటకెక్కాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక.. అమూల్ నుంచి ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది డిప్యూటేషన్లను రద్దు చేశారు. ఈ మేరకు 22 మందిని రిలీవ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అమూల్ పాలఉత్పత్తి సంస్థతో గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకొని మహిళాసంఘాల పేరుతో పాలసేకరణకు శ్రీకారం చుట్టింది.జగనన్న పాలవెల్లువ పేరుతో డెయిరీ కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రభుత్వంలో అదొక భాగంగా పరిగణిస్తూ అమూల్ సిబ్బందిని కాదని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి జగనన్న పాలవెల్లువలో బాధ్యతలు అప్పగించారు. పాలసేకరణకు ఒక్కో గ్రామానికి రూ.మూడు లక్షల విలువైన పరికరాలను ప్రభుత్వనిధుల నుంచి కొన్నారు. సహకారశాఖకు చెందిన అధికారులను అప్ప టి ఉన్నత అధికారి హెచ్.బాబు డెయిరీ కార్యకలాపాలకు వినియోగించడం వల్ల సహకార పనులు ఎక్కడికక్కడనిలిచిపోయాయి. దాంతో అన్ని సహకార సంఘాల్లో ఆడిట్ నిర్వహణకు ఆలస్యమైంది. దీంతో వారి డిప్యుటేషన్‌ను రద్దుచేసి కలెక్టర్ నుంచి నోటిఫికేషన్ పొందాలని డీసీవో నాగవర్ధనను ఆ శాఖ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ హెచ్.బాబు ఆదేశించారు. డిప్యుటేషన్లు రద్దయిన వారిలో.. డెయిరీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జీఏ రవిచంద్రన్, కమాండ్ కంట్రోల్ సెంటర్ అధికారులు కె.త్యాగరాణి, ఎ.ఇమ్మానుయేల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు బి.ఆర్. పవార్, జి.చంద్రన్, జి.వరలక్ష్మి (పుంగనూరు), కె.వెంకటేశన్, పి.మురళీమోహన్ (కుప్పం), జావీద్ బాషా, సి.పార్థిబన్ (పలమనేరు), ఎన్వీ హరికృష్ణ, ఎం.బాబు, జి. పయణి, టి.చెంగల్రాయన్, వై.రమేష్ (పలమనేరు), కె.సులోచన, జి.రజనీకుమార్, టి.ప్రసాద్, జి.ఆనందన్ (పలమనేరు), ఇ.రెడ్డెప్ప (పుంగనూరు), కేవీఆర్ కుమార్, పి.రమణయ్య ఉన్నారు. ఇక డెయిరీ సిబ్బంది పర్యవేక్షణలోనే అమూల్ నిర్వహణ జరగనున్నట్లు సమాచారం.

## పెరుగుతున్న దిగుబడులు..తగ్గుతున్న ధరలు

ఆందోళనలో టమోటా రైతులు

సోమల, జూలై 5: టమోటా ధరలు రోజురోజుకూ తగ్గు ముఖం పడు తున్నాయి. శుక్రవారం 15కిలోల బాక్సు రూ.350కి చేరుకుంది. నాణ్యత గల టమోటాలు రూ.350 పలుకుతుండగా రెండో రకం రూ.200నుంచి రూ.300లోపు పలుకుతున్నాయి. వారం రోజులుగా రూ.750 నుంచి రూ.350కు చేరాయి. టమోటాలు దిగుబడులు భారీగా పెరగడంతో ఇలా రేటు తగ్గుతూ వస్తోంది. మార్చి చివర, ఏప్రిల్ నెలల్లో నాట్లు వేసిన పొలాల నుంచి దిగుబడులు భారీగా రావడం ధరలు తగ్గుముఖం పట్టడానికి కారణమైంది. దీని వల్ల పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.


## తాజా, మాజీ కలెక్టర్లు కలిసిన వేళ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 5: జిల్లా మాజీ కలెక్టర్ షన్మోహన్ తాజా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీవారి దర్శనార్థం వచ్చిన షన్మోహన్ చిత్తూరు ఆర్ అండ్ బీ అతిథిగృహంలో విడిది చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలుసుకున్నారు.



# వీధి దీపాలు సరే.. కరెంటు బిల్లు కట్టరా?

పుంగనూరులో ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం ● మూడు నెలలుగా బిల్లు కట్టకపోవడంతో సరఫరా నిలిపివేత ● టీడీపీ నేతల అభ్యర్థనతో పునరుద్ధరించిన డిస్కం అధికారులు



పుంగనూరు, జూలై 5: పుంగనూరులో నూతనంగా నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా వెలుగులు విరజిమ్మిలా వీధిదీపాలు అమర్చారు. మూడు నెలలుగా కరెంటు వినియోగించి.. బిల్లు కట్టలేదు. దీంతో విద్యుత్తు శాఖ అధికారులు శుక్రవారం రాత్రి కరెంట్ కట్ చేశారు. పుంగనూరు శివార్లలోని భీమగానిపల్లె శ్రీకృష్ణదేవరాయల విగ్రహం నుంచి రాంపల్లె, కొత్తిండ్లు, పాత బస్టాండ్, ఇందిరాసర్కిల్, ఎంబీటీ రోడ్డు, తూర్పుమొగసాల, పలమనేరు రోడ్డు, గూడూరుపల్లె మీదుగా అరబ్బిక్ కాలేజీ వరకు కేంద్రప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులు, కల్వర్టులు, ప్లాట్‌ఫారం, 10 కిలోమీటర్ల రోడ్డును ఎన్‌హెచ్ అధికారులు నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా ఇళ్లులేకపోయినా జాతీయ రహదారుల అధికారులు 510 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కంపెనీ యుద్ధప్రాతిపదికన పనులు వేగవంతం చేసి లైట్లు అమర్చింది. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి టెస్టింగ్ పేరుతో కరెంట్ కనెక్షన్లు తీసుకున్నారు. ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు కరెంట్ వాడుతున్నారని వెంటనే మూడునెలల క్రితం వీధి దీపాలకు ఉపయోగించే కరెంట్‌కు మీటర్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి విద్యుత్ అధికారులు పనులు పర్యవేక్షించే ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్ వెంటపడుతూ మీటరు ఎవరి పేరుతో రికార్డు చేయాలి, కరెంట్ వినియోగానికి ఎవరు బిల్లు చెల్లిస్తారని పలుమార్లు అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్‌హెచ్ అధికారులు మాత్రం మున్సిపాలిటీ వారు చెల్లిస్తారని చెప్పడం మొదలుపెట్టారు. కాగా, పుంగనూరు పట్టణంలో వెలిగే లైట్లు తక్కువ, ఇక్కడ ఆదాయం, బడ్జెట్ తక్కువగా ఉండటంతో తమకు కష్టమని మున్సిపాలిటీ చెప్పింది. ఎన్నిలైట్లు వేశారనే సమాచారాన్ని మున్సిపాలిటీకి ఇవ్వకుండా, తమకు అప్పగించకుండా తామెలా బిల్లు కడుతామని కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్‌హెచ్ అధికారులే బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు. పలుమార్లు ఎన్‌హెచ్ అధికారులకు ఫోన్, లిఖితపూర్వకంగా లేఖలు పంపినా స్పందన లేదని మున్సిపల్, విద్యుత్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 510 విద్యుత్ దీపాలకు కరెంట్ ఉపయోగించి ఒక్కపైసా బిల్లు చెల్లించకపోవడంతో ఎనర్జీ ఆడిట్‌లో తమకు ఇబ్బందులు తప్పవని, ముందు కరెంట్ బిల్లు ఎవరు చెల్లిస్తారో తేల్చుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ శశిధర్ వీధిదీపాలకు కరెంట్ కట్ చేయించారు. పుంగనూరులో వీధిదీపాలు వెలగక చీకటిలో ఉంటే ప్రమాదాలు, ఇతర ఘటనలు జరుగుతాయని, రెండురోజుల్లో ఈసమస్య పరిష్కారమవుతుందని తెలుగుదేశం పార్టీనాయకులు కోరారు. దీంతో అధికారులు సరఫరాను పునరుద్ధరించారు.

## ఆగ్రో బయోఫ్యూచర్ కంపెనీలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్కుఫోర్స్ అధికారులు

పలమనేరు, జూలై5 : పలమనేరు మండలం కొలమాసనపల్లిలోని ఆగ్రోబయోఫ్యూచర్ కంపెనీలో టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. కంపెనీలో తయారు అవుతున్న ఎరువులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ ఆదేశాల మేరకు వీరు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు నాణ్యమైన ఎరువులను, విత్తనాలను పురుగుమందులను అంద జేయాలన్న ధ్యేయంతోనే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి ఎరువుల నాణ్యత, సంస్థ సామర్థ్యం, తదితర వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపుతామని వారు తెలిపారు. ఈ తనిఖీలో అధికారులు డీపీడీ దేవనారాయణ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి చంద్రశేఖర్, పలమనేరు మండల వ్యవసాయశాఖ అధికారిణి సంధ్య పాల్గొన్నారు.

## తిరుమలలో కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్టేట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తిరుమలలో తనిఖీలు కొనసాగిస్తున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీలో భారీగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చిన క్రమంలో రెండువారాలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు టీటీడీలోని పలు విభాగాల్లో సోదాలు చేస్తున్నారు. ఆయా విభాగాల అధికారులు, కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది, బదిలీపై వెళ్లిన అధికారులు, వారి వివరాలను సేకరించడంతో పాటు నిధులను ఎక్కడ, ఎలా వినియోగించారనే అంశాలపై ఆరా తీస్తున్నారు. తాజాగా, గురువారం ఎస్టేట్ విభాగంతో పాటు సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ టికెట్లు కేటాయించే ఈవో కార్యాలయంలోనూ సోదాలు చేసినట్టు సమాచారం. ఈవో కార్యాలయంలోని ఇద్దరు ముఖ్యమైన అధికారులను ప్రశ్నించి స్టేట్‌మెంట్ తీసుకున్నట్టు తెలిసింది. వీఐపీ బ్రేక్ టికెట్లు ఎలా కేటాయిస్తున్నారు, ఎవరికి కేటాయిస్తున్నారు, కేటాయింపుల్లో ఏవైనా అక్రమాలు జరిగాయా అనే కోణంలో విచారించినట్టు తెలిసింది. ఇక, తిరుపతిలోనూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో శుక్రవారం సోదాలు చేసి పలు రికార్డులు తీసుకున్నట్టు సమాచారం.మరో రెండుమూడువారాల పాటు సోదాలు జరగనున్నట్టు సమాచారం.

# టూరిజం హబ్‌గా తిరుపతి

మంత్రి కందుల దుర్గేశ్



పర్యాటక శాఖ అధికారులతో మంత్రి దుర్గేశ్ సమీక్ష

చంద్రగిరి/తిరుపతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిని టెంపుల్...ఎకో...హెల్త్ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన అక్కడే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేవరాగం పేరిట ఏర్పాటు చేసిన హోటల్‌ను ప్రారంభించారు.అనంతరం తిరుపతి చేరుకుని జూపార్కు సమీపంలో టూరిజం శాఖకు కేటాయించిన 30 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.ఏపీ టూరిజం కార్యాలయం, భవనాలు, స్థలం, స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను తనిఖీ చేశారు. పర్యాటకాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో సినీ స్టూడియో నిర్మాణంపై నిర్మాతలతో మాట్లాడతామన్నారు. పర్యాటక అభివృద్ధికి చాలా అవకాశాలున్నా గత ప్రభుత్వం ఒక్క కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకెళ్లడానికి చూస్తామన్నారు. ట్రెక్కింగ్.. రోప్‌వే ఏర్పాటుకు అవకాశాలపై అధికారులతో చర్చించామన్నారు. జూపార్క్ దగరున్న 30 ఎకరాల భూమిలో 20 ఎకరాలు ఓబరాయ్ హోటల్‌కు, 10 ఎకరాలు దేవ్‌లోక్ సంస్థకు గతంలో ఇచ్చినా వినియోగించుకోలేదన్నారు. జూలైలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.రుయాస్పత్రి ఎదురుగా అసంపూర్తిగా వున్న టూరిజం బిల్డింగ్‌పై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.చంద్రగిరి కోటలో ఏర్పాటు చేసిన లైట్ అండ్ మ్యూజిక్ షోను త్వరలోనే పునఃప్రారంభిస్తామని తెలిపారు.ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,టూరిజం ఎండీ కన్నబాబు,రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, డీవీఎం గిరిధర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్ ఎన్వీ ప్రసాద్, జనసేన నాయకులు హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, సుభాషిణి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

## ఐదు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 5: జిల్లావ్యాప్తంగా గడచిన 24 గంటల్లో ఐదు మండలాల్లో తేలిక పాటి వర్షం కురిసింది. పెనుమూరులో 16.6మి.మీ, శ్రీరంగరాజపురం 10.4, పూతలపట్టు 9.8, చిత్తూరు రూరల్ 6.0, పాలసముద్రంలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

## వరసిద్ధుడి సేవలో రాజధాని రైతులు



ఐరాల(కాణిపాకం), జూలై 5: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని శుక్రవారం రాజధాని ప్రాంతమైన తుళ్లూరుకు చెందిన 150 మంది రైతులు దర్శించుకున్నారు. తమ కష్టాలు తీరి రాష్ట్రం అభివృద్ధి చెందాలని వరసిద్ధుడికి, తిరుమల శ్రీవారికి మొక్కుకున్నామని, ఇప్పుడా మొక్కులు తీర్చుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కంపెనీలు వచ్చి యువత అందరికీ ఉద్యోగాలు రావాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. వీరి వెంట ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు పాల్గొన్నారు.

# రైతులను ఆఫీసుల చుట్టూ తిప్పవద్దు

● అధికారులను ఆదేశించిన మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్


పెద్దతిప్పసముద్రం మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్

పెద్దతిప్పసముద్రం జూలై 5 : పలు గ్రామాల నుంచి వివిధ సమస్యలతో వచ్చే రైతులను ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దని వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని మదనపల్లె ఆర్డీవో హరిప్రపసాద్ అధికారులను ఆదేశించారు. పెద్దతిప్పసముద్రం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆర్డీవో హరిప్రపసాద్ ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయంలోని పలు రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో సమావేశమైన ఆర్డీవో మాట్లాడుతూ వీఆర్వోలు తక్షణం భూసమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆదేశించారు. కార్యాలయ ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆఫీసులో చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకుని చెత్తచెదారాన్ని అందులోనే వేసే విధంగా చూసుకోవాలన్నారు. కాగా అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తా జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డిని మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్ చెన్నరాయునిపల్లెకు చేరుకుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, డిప్యూటీ తహసీల్దార్ విద్యాసాగర్, మొలకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, టీడీపీ యువనాయకుడు మనోజ్ఞ యంత్‌రెడ్డి, పీటీఎం ఎస్‌ఐ రవీంద్రబాబు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

## బి.కొత్తకోటలో ఉచిత ఇంటి జాగాలంటూ హైడ్రామా

● ఆర్డీవో హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

బి.కొత్తకోట, జూలై 5: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని బెంగళూరు రోడ్డులో తనకు హక్కు ఉన్న జాగాలో ఉచితంగా ఇంటి జాగాలు ఇస్తానంటూ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. సర్వే నెంబరు 245-243 భూమిలోనికి సుమారు వంద మందిని వెంటబెట్టుకెళ్లి తానే ఒక్కొక్కరికీ వరుసగా స్థలం చూపించసాగాడు. విషయం తెలియడంతో ఆ స్థలాన్ని చదును చేయించిన పట్టణానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి తన అనుచరులతో వెళ్లి అడ్డుకున్నాడు. ఈ భూమిపై హక్కు తమదంటూ గొడవకు దిగాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తహసీల్దారు కార్యాలయంలో తేల్చుకోవాలంటూ ఇరువురిని పంపివేశారు. దీంతో ఇంటి జాగాలు ఇస్తానని చెప్పిన వ్యక్తి వారినందరినీ వెంటబెట్టుకుని తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సరిగ్గా అప్పుడే కార్యాలయ పరిశీలనకు వచ్చిన మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్‌కు విషయాన్ని మొరపెట్టుకున్నారు. తనకు పిత్రార్జితంగా ఈ భూమి సంక్రమించిందని రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆన్‌లైన్ చేయలేదని అతను పేర్కొన్నాడు. దీనిపై తహసీల్దారుకు వివరంగా ఫిర్యాదు చేస్తే విచారించి న్యాయం చేస్తామని ఆర్డీవో పేర్కొన్నారు.

### ఆధారాలుంటే పరిశీలిస్తాం: తహసీల్దార్

ఇంటి జాగాలు ఉచితంగా ఇస్తానంటూ చెబుతున్న వ్యక్తికి భూమిపై ఏమి హక్కు ఉందో ఆధారాలను బట్టి విచారిస్తామని తహసీల్దారు పుణ్యవతి తెలిపారు. ఇరుపక్షాలు భూమిపై ఉన్న హక్కును నిరూపించుకుని భూమి పొందవచ్చని లేదంటే న్యాయ స్థానాన్ని ఆశ్రయించవచ్చని తహసీల్దారు తెలిపారు.

## రూ.2.83లక్షల కర్ణాటక మద్యం, సారా ధ్వంసం


పట్టుబడిన కర్ణాటకమద్యం, నాటుసారా ధ్వంసం చేయిస్తున్న ఎస్‌ఈబీ ఈఎస్ శ్రీనివాసులు, డీఎస్పీ ప్రసాదరెడ్డి

మదనపల్లె టౌన్, జూలై 5: స్థానిక కనుమలో గంగమ్మ గుడి రోడ్డులో ఎస్‌ఈబీ ఈఎస్ శ్రీనివాసులు, డీఎస్పీ ప్రసాదరెడ్డి సమక్షంలో రూ.2.83లక్షల విలువ చేసే మద్యం, నాటుసారాను ఎక్స్‌కవేటర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎస్‌ఈబీ ఈఎస్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల సమ యంలో మదనపల్లె వన్ టౌన్, నిమ్మనపల్లె, పెద్దమండ్యం పోలీ సు స్టేషన్‌ల పరిధిలో నిబంధనలు అతిక్రమించి అధనంగా ఆం ధ్ర మద్యం, కర్ణాటక మద్యం అక్రమ రవాణా, నాటుసారా తర లిస్తుండగా అధికారుల దాడులు చేసి 50 కేసులు నమోదు చేశా రన్నారు. ఇందులో మొత్తం రూ.2.83లక్షల విలువ చేసే 3122 లీటర్ల మద్యం, 847 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వలీబషు, నిమ్మనపల్లె, పెద్దమండ్యం పోలీసులు పాల్గొన్నారు.

## 3500 లీటర్ల సారా ఊట ధ్వంసం

పీలేరు, జూలై 5: కేవీపల్లె మండలం జిల్లేళ్లమంద అటవీ ప్రాంతంలో శుక్రవారం 3500 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ పీలేరు సీఐ శ్యాంప్రసాద్ తెలిపారు. తమకు అందిన రహస్య సమాచారం మేరకు జిల్లేళ్లమంద అటవీ ప్రాంతంలో దాడి చేసి సారా తయారీకి సిద్ధంగా ఉన్న ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన వివరించారు. ఈ దాడిలో ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది శేఖర్, సుధాకర్, సురేశ్, రమేశ్, చందు, నాగేంద్ర, శివసుదర్శన్ రావు, సునీల్ కుమార్ పాల్గొన్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

మదనపల్లె టౌన్, జూలై 5: మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సీటీఎం క్రాస్‌రోడ్డుకు చెందిన అశోక్(30) భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నిర్మాణ పనులు చేపట్టడానికి ద్విచక్రవాహనంలో మదనపల్లె పట్టణానికి బయలుదేరాడు, మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అశోక్‌కు తీవ్రగాయాలు కాగా మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స అందించిన వైద్యులు అశోక్ పరిస్థితి విషమంగా మారడంతో తిరుపతికి రెఫర్ చేశారు. అవుట్‌పోస్టు పోలీసులు మదనపల్లె తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

## సినిమా థియేటర్‌లో తనిఖీలు

ములకలచెరువు, జూలై 5: ములకలచెరువులోని సినిమా థియేటర్‌లో శుక్రవారం రెవెన్యూ అధికారులు తనిఖీ చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ హరికుమార్, ఆర్‌ఐ వీరాంజనేయులు థియేటర్‌లోని వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వారి వెంట వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు ఉన్నారు.

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

పెద్దమండ్యం, జూలై 5: చికిత్స పొందుతూ కీర్తన(20) అనే వివాహిత ఆసుపత్రిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు పెద్దమండ్యం గ్రామ పరిధిలోని బిక్కావాండ్లపల్లి కు చెందిన రెడ్డప్ప కుమార్తె కీర్తనకు మదనపల్లి మండలం పెంచిపాడు గ్రామ పంచాయతీ గొల్లపల్లికు చెందిన లక్ష్మన్నతో 8 నెలల క్రితం వివాహమైంది. గత వారం రోజుల క్రితం భార్యభర్తలిద్దరు బిక్కావాండ్లపల్లికు వచ్చారు. ఈ నెల 3వ తేదీన కీర్తనకు తీవ్రంగా కడపు నొప్పి రావడంతో ఇంట్లో ఉన్న బలం కోసం తెచ్చి ఎక్కువగా మాత్రలు మింగింది. అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు చికిత్స నిమిత్తం అన్నమయ్య జిల్లా రాయచోటికి తరలించారు. అక్కడ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్ ఆసుపత్రికు తరలించారు. ఆక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శుక్ర వారం పెద్దమండ్యం పోలీసులకు మృతురాలి బంధువులు ఫిర్యా దు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్‌ఐ చలపతి తెలిపారు. కీర్తన శవ పరీక్షలు నిమిత్తం కడప ఆసుపత్రిలోనే నిర్వహించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజంపేట టౌన్, జూలై 5 : రాజంపేట మున్సిపల్ కార్మికు ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవి కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ప్రతినెలా ఐదో తేదీ లోపల వేతనాలు ఇవ్వాలన్నారు. గతంలో 16 రోజుల నిరవధిక సమ్మెకు సంబంధించి కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. మెడికల్ బిల్లు అమలు చేయాలని, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ స్టేజి చెప్పాలని కోరారు. బదిలీ వర్కర్స్‌కు మూడు నెలల నుంచి వేతనాలు రాలేదని, ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి రమణ, ప్రసాద్, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

వీరబల్లి, జూలై 5: సాగులో ఉన్న గిరిజనుల భూమిని కబ్జా చేసి మామిడి చెట్లు నాటిన రాజ గోపాల్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన స మాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్‌నాయక్ డిమాం డ్ చేశారు. శుక్రవారం గిరిజన రైతులతో కలిసి భూమిని పరిశీ లించిన అనంతరం బాధితులతో కలిసి వీరబల్లిలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరబల్లి మండలం తాటిగుంట పల్లె గ్రామ పంచాయతీ కొత్తపల్లి ఎరుకుల కాలనీలో నివాసముంటున్న సాలముని లక్ష్మీదేవి భర్త రమణయ్య 1732 సర్వే నెంబర్‌లోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని 30 ఏళ్లగా సాగు చేసుకుంటుండగా, రాజగోపాల్‌రెడ్డి ఆ భూమిలో దౌర్జన్యంగా మామిడి మొక్కలు నాటి వారిపై దౌర్జన్యం చేశాడని, ఆ భూమిని గిరిజనులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

## బీసీల సమస్యలు పరిష్కరించండి


మంత్రి సవితమ్మను కలిసిన బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్

కురబలకోట, జులై 5: బీసీలను అన్ని విధాలా ఆదుకుని వారి సమస్యలు పరిష్కరించాలని తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు బీసీ సంక్షేమ, జౌళి చేనేతశాఖ మంత్రి సవితమ్మను కోరారు. శుక్రవారం పెనుగొండలో పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లి మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తమ నియోజకవర్గంలో పర్యటించాలని కోరగా, త్వరలోనే పర్యటిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె నియోజకవర్గ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కాగా గత ప్రభుత్వంలో బీసీలపై దాడులు, అక్రమ కేసులు నమోదు చేశారని వాటిని పరిష్కరించాలని, బీసీ భవనాలు, బీసీ హాస్టల్స్‌లు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సదా శివ తదితరులు పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలి



బసినికొండ జడ్పీహైస్కూల్ నుంచి విద్యాప్రవేశము కార్యక్రమం నిర్వహిస్తున్న డీఈవో శివప్రకాష్‌రెడ్డి

మదనపల్లె టౌన్, జూలై 5: బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించడానికి విద్యాప్రవేశ కార్యక్రమం విజయవంతం చేయాలని డీఈవో శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండలంలోని బసినికొండ జడ్పీ హైస్కూల్ నుంచి విద్యాప్రవేశం కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ బడికి రాని విద్యార్థులను గుర్తించి విద్యాహక్కు చట్టం ప్రకారం నిర్బంధ విద్యను అందించాలన్నారు. కింది తరగతి నుంచి పై తరగతిలో చేరే విధంగా ఉపాధ్యాయులు బాధ్యతలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో విద్యాప్రవేశము కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, కరుణాకర్, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఫిజికల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు భాస్కరన్, ఎస్టీయూ నాయకుడు మధుసూధన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మదనపల్లెలో డయేరియాపై యుద్ధం చేద్దాం


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెమ్మ

మదనపల్లె టౌన్, జూలై 5: మదనపల్లె మండలంలో డయేరియా వ్యాధి ప్రబలకుండా యుద్ధం చేద్దామని ఎంపీపీ రెడ్డెమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భానుప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలంలో డయేరియా వ్యాధి పెరిగే అవకాశం ఉందని దీనిపై ప్రభుత్వం ఇచ్చిన నిర్దిష్ట ప్రణాళికలు అమలు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం ప్రత్యేక మొబైల్ యాప్ అందజేసిందని, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పర్యటించి ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, మురుగునీటి కాలువలు శుభ్రం చేసిన ఫొటోలను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా అమలు చేసి విజయవంతానికి కృషి చేయాలన్నారు. ప్రత్యేక అహ్వానితుడు వెలుగు చంద్ర మాట్లాడుతూ సీటీఎం గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు చేయాలన్నారు. ఎస్పీడీసీ ఎల్ సీటీఎం ఏఈ రమేశ్ మాట్లాడుతూ పలుచోట్ల ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంటు స్తంభాలను మార్చడంలో ఆలస్యమవుతోందన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు డిష్ రమణ, నందిని, పంచా యతీ రాజ్ ఏఈ రమణ, హౌసింగ్ ఏఈ దీనదయాళ్, సీడీపీవో సుజాత, ఏవోలు నాగప్రసాద్, ఈశ్వర, ఏపీఎం సురేశ్‌రెడ్డి, ఏపీవో సుబ్ర మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శివపార్వతుల కల్యాణం


పీటీఎం శివాలయంలో శివపార్వతుల కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం జూలై 5 : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా, కమనీయంగా నిర్వహించారు. పీటీఎంకు చెందిన ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో శివునికి అత్యంత ప్రీతి పరమైన ఆరుద్ర నక్షత్రం కావడంతో ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి స్వామి వారిని సుందరంగా అలంకరించారు. అనంతరం సాయంత్రం కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేదపండితులు పణితేజస్వామి, కన్నాస్వామివారిచే శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని పీటీఎంతో పాటు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కోర్టులో గంగమ్మకు విశేషపూజలు


కోర్టులో గంగమ్మను దర్శించుకొంటున్న భక్తులు

మదనపల్లె అర్బన్, జూలై5: స్థానిక కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ సభ్యులు విశేషపూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయాన్నే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొల్పి ప్రత్యేకంగా అర్చనలు, అలంకరణలు చేసి దూప దీప నైవేద్యాలు సమర్పించి విశేసపూజలు నిర్వహించారు. రాహుకాల సమయంలో అధిక సంఖ్యలో మహిళలు చీర, జాకెట్లు పసుపు, కుంకుమలతో ఆలయానికి తరలివచ్చి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి శేణుగోపాలనాయుడు, కార్యదర్శి మర్పూరి ప్రభాకర్‌రనాయుడు, ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, కరుణాకర్, మార్పూరి మహేష్, మార్పూరి విక్కి, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

## ఉద్యాన పంటలలో మెలకువలు పాటించాలి


గుబురుగా కత్తిరించిన మామిడి చెట్లు

నిమ్మనపల్లె, జూలై 5: ఉద్యాన పంటలలో మొలుకు వలు పాటిస్తే అధిక ధిగుబడులతో పాటు లాభాలు సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మామిడిలో సస్య రక్షణ చర్యల గురించి రైతల కు తెలియజేశారు. మండలం లో దాదాపు 1300 వందల ఎక రాల్లో మామిడి తోటల పెపంకం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఏడా ది మామిడిలో దిగుబడి ఆశాజనకంగా లేకపోవడానికి కారణం యాజ మాన్య పద్ధతులు పాటించపోవడమేనని తెలిపారు. ముఖ్యంగా కాయలు కోసిన 20రోజుల వరకు చెట్టుకు విశ్రాంతి నివ్వాలన్నారు. అనతరం జూన్ 15 నుంచి జూలై 15 లోపు చెట్టుకు ఉన్న కొమ్మలను గొడుగులా కత్తించాలని తెలిపారు. దీని వలన వెలుతురు ఎండ గాలి వంటివి చెట్టుకు అందుతాయని అలాగే ఆకుపచ్చ మచ్చతెగుల, బూడిద తెగులు రాకుండా ఉంటుందని తెలిపారు తెలిపారు. కత్తిరింపు తరువాత చెట్ల మధ్యలో ఏటవాలుగా లోదుక్కులు దున్నాలని దున్నకాల ద్వారా క్రిమికీ టకాలు, పురుగులు చనిపోతాయని తెలిపారు. 10సంవత్సరాల వయస్సు కలిగిన చెట్లకు ఒక చెట్టుకు యూరియా 1.5 కేజీలు. సూపర్‌పాస్‌పేట్ 3కేజీలు, పోటాష్ 1కేజీ మూడూ కలిపి వేయాలన్నారు. అలాగే బోరాన్ 75గ్రాములు, జింక్‌సల్ఫేట్ 100గ్రాములు, మెగ్నీషియం 100గ్రాములు, పశువుల ఎరువు 100గ్రాములు వేస్తే అధిక దిగుబడులతో ఎక్కువ కాలం మన్నుతాయిన తెలిపారు.

## ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటా..


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, జూలై 5: పీలేరు నియోజకవర్గంలో ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, అవినీతి అక్రమాలు తప్పా ప్రజలకు ఒరిగింది శూన్యమని విమర్శించారు. ఎన్నికల్లో ఆదరించి ప్రజలు మంచి మెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఏ కష్టమొచ్చినా తప్పక ఆదుకుంటానని హామీ ఇచ్చారు. వాల్మీకిపురం మండల పర్యటనలో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి గజమాలలతో స్వాగతం పలుకుతూ సుమారు 2వేల బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు జాగ్రత్తతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమాలలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, పీలేరు జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, పీలేరు తెలుగు యువత అధ్యక్ష, ఉపాధ్యక్షులు మహీధర్‌రెడ్డి, లంకిపల్లె మధు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, నాయకులు గాంధీపేట రమణ, కృష్ణారెడ్డి, పులి సత్యారెడ్డి, రాజేంద్రాచారి, పీలేరు పార్టీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, శేషాద్రిరెడ్డి, ద్వారకనాథరెడ్డి, పీవీ నారాయణ, వల్లిగట్ల రమణ, మద్దెల గిరిబాబు, రవికుమార్‌రెడ్డి, బొక్కసం బ్రదర్స్, తెలుగు యువత చాను, సాదిక్, డిష్ బ్రదర్స్, యూసుఫ్, జనసేన ప్రభాకర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

## పీలేరు పంచాయతీ నిధుల వ్యయంపై విచారణ


పీలేరు పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారుల బృందం

పీలేరు, జూలై 5: పీలేరు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై అధికారులు విచారణ చేపట్టారు. మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజ నేతృత్వంలో ఐదుగురు అధికారుల బృందానికి జిల్లా కలెక్టర్, డీపీవోలు ఆ బాధ్యత అప్పగించారు. అందులో భాగంగా ఐదుగురు అధికారుల బృందం శుక్రవారం నుంచి తమ పని ప్రారంభించింది. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి ఇటీవలి కాలం వరకు పీలేరు పంచాయతీకి మంజూరైన నిధులు, వాటి వ్యయంపై వారు దృష్టి సారించారు. మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు బృంద నాయకుడిగా వ్యవహరిస్తుండగా కలికిరి మండల ఈవోపీఆర్‌ఆర్‌డీ పరశురాం, నాగిరెడ్డిపల్లె పంచాయతీ కార్యదర్శి హరి, మదనపల్లె డీఎల్‌పీవో కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్లు ఉదయ్ కిరణ్, నవీన్ రాజు సభ్యులుగా ఉన్న ఈ బృందం పీలేరు పంచాయతీ కార్యాలయానికి చేరుకుని కార్యాలయంలో ఉన్న రికార్డులు స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు.

### పంచాయతీలో అవినీతిపై టీడీపీ దృష్టి

పీలేరు పంచాయతీ పాలన వైసీపీ నాయకుల చేతుల్లోకి వెళ్లినప్పటి నుంచి అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో వాటిపై విచారణ జరిపించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి నిర్ణయించుకుని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు మదనపల్లె డీఎల్‌పీవో నేతృత్వంలో ఐదుగురు అధికారులను జిల్లా ఉన్నతాధికారులు నియమించారు. వారి విచారణలో ఎటువంటి వాస్తవాలు వెలుగు చూస్తాయో వేచి చూడాలి.

## ప్రజలకు సక్రమంగా నీటి సరఫరాకు చర్యలు


14వ వార్డులో పైపులైన్ పనులు చేపడుతున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, జూలై 5: స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సహకారంతో మున్సిపాలిటీలోని 14వ వార్డులో మంచినీరు సక్రమంగా అందేలా పైపులైను సమస్యను పరిష్కరిస్తున్నట్లు టీడీపీ నాయకుడు నాగూర్‌వల్లి తెలిపారు. ఇందులో భాగంగా వార్డులో రెండు రోజులుగా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండడం గమనించిన ఆయన పైపులైన్ సక్రమంగా ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు తమ ఇష్టానుసారంగా పైపులైన్లు అమర్చడంతో సమస్య తలెత్తిందని చెప్పారు. ఈ విషయంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్లగా ఆయన మున్సిపల్ అధికారులను సమస్య పరిష్కరించాలని ఆదేశించడంతో సమస్య పరిష్కారమైందన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

తంబళ్లపల్లె, జూలై 5: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఈ నెల 8వ తేదీన (సోమవారం) పుంగనూరు ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన, ఐటీఐలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు వారి విద్యార్హతను బట్టీ జాబ్ మేళా ఉంటుందన్నారు. ఈ మేళాకు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, ఏపీ నుంచి ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వారి వారి బయోడేటాతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, విద్యార్హత ధృవపత్రాలు జిరాక్స్ కాపీలతో పుంగనూరు ఐటీఐలో 8వ తేదీన ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

## గుండెపోటుతో వీఆర్‌వో మృతి


వీఆర్‌వో ముజీబ్ (ఫైల్)

కురబలకోట, జులై 5: మండలంలోని మట్లివారిపల్లె పంచాయతీ వీఆర్‌వోగా పనిచేస్తున్న ముజీబ్(51) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. మదనపల్లె పట్టణం ఎగువ కురవంకలో కాపురం ఉంటున్న అతనికి వేకువజామున గుండెపోటు రావడంతో కుటుంబీకులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెంది నట్లు తెలిపారు. కాగా పలువురు రెవెన్యూ అధికారులు ముజీబ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబీకులకు సానుభూ తిని తెలియజేశారు.

## అక్రమ కట్టడాన్ని తొలగించి ప్రభుత్వ స్థలం కాపాడండి


డీటీకి వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నాయకులు

ములకలచెరువు, జూలై 5: ములకలచెరువులోని ఎంపీడీవో కార్యాలయం వద్ద జరుగుతున్న అక్రమ కట్టడాలు ఆపి, ఆక్రమణను తొలగించి ప్రభుత్వ స్థలం కాపాడాలని టీడీపీ నాయకులు కోరారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ హరికుమార్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నాయకులు భారీ సంఖ్యలో హాజరై అక్రమ కట్టడాలు ఆపాలని విన్నవించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం ప్రహరీ ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో బోగస్ పట్టాలతో అక్రమ కట్టడం వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమై నేటికి జరుగుతోందని, దీనిపై తక్షణ చర్యలు తీసుకుని ఇంటి నిర్మాణం ఆపాలని కోరారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమ కట్టడం తొలగించాలని ఇప్పటికే సెక్షన్ -2 కింద నోటీసు జారీ చేశామని, శనివారం నాటితో నోటీసు గడువు ముగుస్తుందని, ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా అక్రమ కట్టడంపై అనవసరంగా టీడీపీ నేతలపై సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ తిప్పేస్వామికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేతలు తోట గిరిధర్, మయాన్ బాషా, చెన్నకిష్టా, కేశవులు, వెంకటస్వామి, కట్టా హరినాద్, ప్రతాప్‌నాయుడు, రమణ మూర్తి, పెద్దరెడ్డెప్ప, రెడ్డెప్ప, సోమశేఖర్, రెడ్డెప్ప, శివన్న, నారాయణ స్వామినాయుడు, నరసింహులు, చాంద్‌బాషా, బుర్రారమణ, భాస్కర్‌నాయుడు, సుబ్బినాయుడు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

గుర్రంకొండ, జూలై 5:ఉద్యోగులకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి కోరారు. ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన శుక్రవారం ఎల్లుట్లలో మాట్లాడుతూ జీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు. అలాగే భాషా పండితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూసఫ్, వెంకటయ్య, రెడ్డెన్న, రాజేంద్రప్రసాద్, శంకరయ్య, హసన్, రజని, షమాబాను తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

గుర్రంకొండ, జూలై 5:గుర్రంకొండ మండల స్థాయి అధికారులతో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు నాయిని.జగదీష్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటలకు నాయకులు, కార్యకర్తలతో సమావేశం, అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

## తగ్గుతున్న జలం.. ఆందోళనలో జనం

● బాహుదాలో తగ్గుముఖం పట్టిన నీరు ● తాగు, సాగుకు కష్టాలు తప్పవంటున్న ప్రజలు

నిమ్మనపల్లె, జూలై 5: మండలంలోని ముష్టూరు పంచాయతీలో గల బాహుదా ప్రాజెక్టులో నీరు తగ్గి ఎండి పోయేపరిస్థితి నెలకొంది. గత కొన్నేళ్లుగా వర్షాలు రాకపోవడంతో ఉన్న నీటిని పంట పొలాలకు వదలడం వలన ఈ సరిస్థితి నెలకొంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2880ఎకరాలల్లో పంట సాగుకు అనుమతులు ఉన్నప్పటికి అంతకంటే ఎక్కువగా 3వేల ఎకరాలకు పైగా రైతులు సాగు చేసేవారు. బాహుదా ప్రాజెక్టు సామర్థ్యం 398ఎమ్‌సీఎఫ్‌టీ కెపాసిటీ కాగా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండితే 2ఏళ్ల పాటు మూడు మండలాలకు తాగు, సాగు నీటికి ఇబ్బంది కలుగదు. అలాంటిది ప్రస్తుతం బాహుదాలో నీరు తగ్గి ఎండిపోయే స్థితిలో ఉంది. ముఖ్యంగా బాహుదా కాలువలు సక్రమంగా నిర్మించకపోవడమేనని రైతులు తెలిపారు. గత కాం గ్రెస్ ప్రభుత్వంలో ఎడమ, కుడి కాలువల నిర్మాణాలు చేపట్టినా అవి కాస్త సక్రమంగా నిర్మించపోగా అర్ధాంతరంగా నిలిచిపోవడంతో పంట పొలాలకు నీరు పోయే పరిస్థితి లేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు నీళ్ల లేక బాహుదా కింద ఉన్న రైతులు వారి భూములలో గడ్డి నాటుకొని పాడి పశువులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం అందించే రైతు భరోసా కొందరికి మాత్రమే అందుతున్నట్లు తెలుస్తోంది. ఎండా కాలం పోయి వర్షాకాలం వచ్చినా బాహుదాలో చుక్కనీరు చేరకపోవడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. తాగునీటికికి కూడా అవస్థలు పడాల్సివస్తుందేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంలో రైతులు ఉద్యానపంటల వైపు మక్కువచూపుతున్నా అక్కడ కూడా సరైన ధరలేక రైతులు విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా బాహుదా కాలువలు నిర్మించి నీటిని వృథా కాకుండా నీటిని పంట పొలాలకు వదిలితే ఉపయోగకరంగా ఉంటుందని రైతులంటున్నారు.

### కాలువల మరమ్మతులకు చర్యలు

దీనిపై ఇరిగేషన్ ఏఈ శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ కాలువల మరమ్మతుల కోసం చర్యలు చేపడుతామన్నారు. ఇందు కోసం కొత్తగా వచ్చిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో సంప్రదింపులు జరిపి అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతామని ఆయన తెలిపారు.


బాహుదా ప్రాజెక్టులో అడుగంటిన నీరు


నీరులేక బీళ్లుగా మారిన పంట భూములు